BALA CHELIMI

BALA

MAY 2026

MAY | MAY



₹40

మే - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 8

MAY - 2026




*A celebration in motion Where tiny Grade 1 steps sparkle with joy, and little hearts illuminate the stage with the spirit of Eid. In every smile, there's togetherness. In every rhythm, pure happiness*

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



Sankranthi vibes to Annual Day shines ,our young stars lit up the stage with tradition, talent, and unstoppable energy!



## MAY 2026

Dance is where discipline meets joy, and expression finds its rhythm. Students performing Maharashtra's traditional Lavani Dance.


Oxford
Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com


ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

**Important Dates**

01 May - International Labour Day

27 May - Bakrid

NOTES : ____________________


The only way to predict the future is to build it.

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక


| సంపుటి: Volume: | 35 | సంచిక : Issue : | 8 | హైదరాబాద్ Hyderabad | మే May | పేజీలు Pages | 52 | రూ. ₹. | 40 |
|---|---|---|---|---|---|---|---|---|---|











లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| ప్రియమైన అమ్మానాన్నలకు...... | మణికొండ వేదకుమార్ | 5 |
| భారతీయ భౌతిక శాస్త్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిన సత్యేంద్రనాథ్ బోస్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| "అద్రక్ కే పంజే" – నాటక రంగంలో చిరస్మరణీయ కృతి | | 6 |
| కోటి విద్యలు కూటి కొరకే (ప్రపంచ ఆకలి దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| గోడమీది బల్లి (పాట)... | గంగదేవు యాదయ్య | 8 |
| ప్రిన్సెస్ నీలోఫర్ | షీరోస్–256 | 9 |
| అక్షరాలతో ఆటలు – ఒంటరి అక్షరాలు (అక్షరం) | చొక్కాపు వెంకటరమణ | 10 |
| చైతు – చంద్రమండల యాత్ర (కథ) | పేట యుగంధర్ | 11 |
| ఆకాశ గూఢచారి – U-2 Dragon Lady విమానం ప్రాముఖ్యత | | 12 |
| నమ్మకం (కథ) | పల్లపు గాయత్రి | 13 |
| మంచి స్నేహితులు (కథ) | యం. రోహిత్ | 13 |
| గచ్చకాయలు (ఆట).. | చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి – 12 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| గురుదక్షిణ (కథ) | పుల్లా మురళీ ఆకాశ్ | 17 |
| పక్షి – కోతుల కథ | పంచతంత్ర కథ | 18 |
| చదువు (కవిత)... | రేడియమ్ | 18 |
| బుద్ధవనం | దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి | 19 |
| బజర్ (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| బొమ్మలేద్దామా... | కె. తన్మయశ్రీ | 20 |
| కొత్త మిత్రులు (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| అదృశ్య దేవత (కథ) | ఓట్ర ప్రకాష్‌రావు | 23 |
| క్వాంటమ్ మెకానిక్స్ అర్థం కాదా? రిచ్చర్డ్ ఫెనీమన్ (సైన్స్ వెన్నెల–19) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| మేడి చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| సంకల్ప బలం (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| బెంగాల్ నుంచి ప్రపంచ వేదిక వరకు అరోణ్యక్ ప్రయాణం (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| నిజాయితీకి బహుమతి (కథ) | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 29 |
| వేమన పద్యాలు | | 30 |

| | | |
|---|---|---|
| మెరిసే సీతాకోకచిలుక (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| కలం అక్షర సైనికుడు (కవిత) | ఆర్. జాహ్నవి | 32 |
| మంచికి దండం-చెడుకు గండం (కథ) | విశ్వనాథ సుబ్బారావు | 33 |
| అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు... (సామెతల కథలు – 3)... | బాల కథా సౌరభం | 34 |
| అన్ని మతాలను ఆదరించిన ఇక్ష్వాకులు (చరిత్ర పాఠాలు-15) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| నేర్చుకుందామా | | 36 |
| కలం-చెలిమి | | 36 |
| జీవిత ప్రయాణం (కథ) | ఎస్. భావన | 37 |
| సామెతలు | | 37 |
| కోరుకున్న అంకె (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి డెస్క్ | 38 |
| డీప్ లెర్నింగ్ ఆధారిత డేటా విశ్లేషణ పద్ధతులు (విద్య) | లత | 39 |
| మధుమేహానికి ఆజ్యం పోస్తున్న ఫాస్ట్-ఫుడ్ రుచులు | డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి | 40 |
| నక్క – నీలి రంగు (పిల్లల కథల్లో సైన్స్-4) | కె శ్రీకృష్ణ సాయి | 41 |
| నియంత్రణ సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు (జి. కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| భారతీయ ప్రకృతి వైవిధ్యానికి ప్రతీక "గ్రేట్ ఇండియన్ బస్టర్డ్" | సచిన్ కోత్వాల్ | 44 |
| స్నేహం విలువ (కథ)... | బి. నవ్యశ్రీ | 45 |
| బాలచెలిమి గ్రంథాలయం – కథా రచనలో మా తొలి అడుగులు | బాలచెలిమి గ్రంథాలయం విద్యార్థులు | 46 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 49 |
| యువ క్రికెటర్లకు మార్గదర్శకుడు ఎం.ఎల్.జయసింహ (వ్యక్తిత్వం) | సువేగా | 50 |

# చెలిమి లేఖలు

నమస్కారం, ఈ డిజిటల్ యుగంలో పిల్లలకు పుస్తకాల పట్ల ఆసక్తి పెంపొందిస్తూ బాలచెలిమి పత్రిక కొనసాగుతున్నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది పిల్లల సృజనాత్మకత, ఊహాశక్తిని అభివృద్ధి చేసే విలువైన వేదికగా నిలుస్తోంది. నా చిన్ననాటి జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేసింది. భవిష్యత్ సంచికల కోసం వైద్య, విజ్ఞాన సంబంధిత వ్యాసాల రూపంలో నా సహకారం అందించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ధన్యవాదాలు.

– **డా. కరీమున్నీ షేక్,** తిరుపతి

'బాల చెలిమి' మాసపత్రిక బాలల మనో వికాసానికి విశేషంగా దోహదపడుతోంది. "ఆడుతూ, పాడుతూ పరీక్షలు రాయండి" అనే భావన ఎంతో ప్రేరణాత్మకం. ఏప్రిల్ సంచిక విజ్ఞానదాయకంగా, ఆసక్తికరంగా ఉంది. బాలలు మరింతగా పాల్గొనే విధంగా 'గళ్ల నుడి కట్టు' వంటి పజిల్స్‌ను ప్రవేశపెడితే, వారి ఆలోచనా శక్తి పెరిగి మెదడుకు పదును పడుతుంది. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు పత్రికను మరింత ఆకర్షణీయంగా మార్చగలవు.

– **బిక్కునూరి రాజేశ్వర్,** నిర్మల్

బాల చెలిమి పిల్లల కోసం రూపొందిన అద్భుతమైన పత్రిక. ఇందులో కథలు, పద్యాలు, పజిల్స్, విజ్ఞాన విషయాలు ఉన్నాయి. ఏప్రిల్ 2026 సంచికలో 'ఆనందమానందమాయే' కథ చిన్న విషయాల్లో ఆనందం దాగి ఉందని చెబుతుంది. ఇది మంచి ఆలోచనలు పెంపొందిస్తుంది. తెలుగు నేర్పే స్నేహితుడు. ఎడిటర్ మణికొండ వేదకుమార్ గారికి కృతజ్ఞతలు. ఈ పత్రిక నిజంగా పిల్లలకు జ్ఞానదీపం అవుతుంది.

– **కే. గీతా దుర్గా శెట్టి**

*Cover Picture :*
**Grade 1 students of Oxford Grammar School**
Occasion : Celebration of EID
@ OGS 45th Annual Day Celebrations, held at Lalitha Kala Thoranam.

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్,**
m : 98495 43728




**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St. No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com
Mob: 98480 44713

# ప్రియమైన అమ్మానాన్నలకు...

ప్రియమైన అమ్మానాన్నలకు నమస్కారం...

పాఠశాలలకు సెలవులు యిచ్చారు. గత పది నెలలగా బడి, పాఠాలు, పరీక్షల హడావిడిలో, ఒత్తిడిలో పిల్లలు అలసిపోయారు. ఈ వేసవి సెలవుల్ని ఎంజాయ్ చేయనివ్వండి. అలసిపోయిన దేహాలకు, మనసులకు కాస్తంత ఊరట, విశ్రాంతి నివ్వండి. వేసవి సెలవులు మీకూ, పిల్లలకు మధ్య అనుబంధాన్ని పెంచే సమయం. కలిసి భోజనం చేయడం, ప్రయాణాలు చేయడం, చిన్నపాటి ఆటలు ఆడటం వంటి చిన్న చిన్న సంఘటనలే వారికీ, మీకూ మధురానుభూతులవుతాయి.

వీకెండ్స్‌ను ముందుగానే ప్లాన్ చేసుకొని నోట్‌బుక్‌లో రాసి పెట్టుకోండి. మీకున్న వెసులుబాటును బట్టి బయటి ప్రాంతాలకు చారిత్రక, వినోదాత్మక ప్రదేశాలకు, ప్రకృతి అందాలలోకి తీసుకువెళ్లండి. మీ ఊళ్లోనూ, మీకు దగ్గరలోనూ మీరు కూడా చూడని అనేక ప్రదేశాలు వుండే వుంటాయి. మీ పిల్లలతో పాటు వారి స్నేహితుల్నీ కూడా తీసుకెళ్లండి. మీ ప్రాంతాల్లో జరిగే జాతరలకు, తిరునాళ్లకు యితర ఉత్సవాలకు తీసుకువెళ్లండి. వివిధ సాంప్రదాయాలు, సంస్కృతులు వారికి పరిచయమవుతాయి.

బంధువుల ఇళ్లకు, అమ్మమ్మ, నాయనమ్మ, మేనమామలు, మేనత్తలు ఊళ్లకి తీసుకెళ్లండి. వాళ్ల పిల్లలతో గడపనివ్వండి. కుటుంబ సంబంధాలు, బాంధవ్యాలు, కలుపుగోలుతనం, ఆత్మీయతా స్వభావాలు అలవడతాయి. అవి జీవితానికి భరోసాను యిస్తాయి.

పిల్లలను పుస్తకాల షాపులకు తీసుకువెళ్లండి. వాళ్లకు యిష్టమైన పుస్తకాలు కొనివ్వండి. అవి దాచుకోవడానికి బుక్‌షెల్ఫ్‌లను సమకూర్చండి. పుస్తక పఠనం విస్తృత ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. లోక జ్ఞానాన్ని పెంచుతుంది. వారిలో ఊహాశక్తిని, అవగాహనా శక్తిని, విశ్లేషణా సామర్థ్యాన్ని, భాషా నైపుణ్యాన్ని పెంచుతుంది. మంచి సాహిత్యం సంస్కారవంతమైన సమాజాన్ని తయారు చేస్తుంది. చిత్రలేఖనం. ఫజిల్స్, సంగీతం, డాన్స్ వంటి సృజనాత్మక కళల పట్ల అభిరుచిని పెంచండి.

మొక్కలకు నీళ్లు పట్టడం, ఉతికిన బట్టలు మడతలు పెట్టడం, కబ్‌బోర్డుల్లో సర్దడం, ఇళ్లు చిమ్మడం, తమ బెడ్స్‌ను సర్దుకోవడం వంటి చిన్న చిన్న ఇంటి పనుల్లో భాగస్వాములను చేయండి. ఇంట్లోనే బొమ్మలు చేయడం, పేపర్ క్రాఫ్ట్, కిచెన్ గార్డెనింగ్, ఎండిన ఆకులతో, పూల రెమ్మలతో వివిధ ఆకృతులతో చేసిన చిత్రాలలో ఆల్బమ్ చేయడం వంటి సృజనాత్మక పనులను నేర్పించండి.

ఈ వేసవి సెలవుల్లో అడ్వాన్స్ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులంటూ పిల్లలను ఇబ్బంది పెట్టకండి.

మీ ఇల్లు ఒక పొదరిల్లు, ఒక రంగుల పూలతోట,
మీ పిల్లలు సీతాకోక చిలుకలు,
వారిని స్వేచ్ఛగా, నిర్భీతిగా ఎగరనివ్వండి.
ఆ స్వేచ్ఛలోని అందాన్నీ, ఆనందాన్నీ
మీరు వారితో పాటు ఆస్వాదించండి...

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





## భారతీయ భౌతిక శాస్త్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిన శాస్త్రవేత్త

# సత్యేంద్రనాధ్ బోస్

సత్యేంద్రనాధ్ బోస్ భారతీయ భౌతిక శాస్త్రవేత్త. ఆయన క్వాంటం మెకానిక్స్, గణిత భౌతిక శాస్త్రంలో ప్రత్యేకమైన కృషి చేసారు. ఆయన పేరు మీద బోస్ ఐన్‌స్టీన్ గణాంకాలు, బోసాన్లు అనే పదాలు వచ్చాయి.

సత్యేంద్రనాధ్ బోస్ 1894 జనవరి 1 కలకత్తాలోని గోవా బాగాన్‌లో జన్మించారు. తండ్రి భారతీయ రైల్వేల్లో అకౌంటెంట్‌గా పని చేసారు. ప్రాథమిక విద్యను కలకత్తాలోని హిందూ స్కూల్లో పూర్తి చేసారు. ప్రిసిడెన్సీ కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఇంటర్ మీడియెట్, బి.యస్.సి., ఎం.ఎస్.సి. (అప్లైడ్ మ్యాథమిటిక్స్) పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ ఆయన గురువులలో ఒకరు. మరో శాస్త్రవేత్త మేఘనాధ్ సాహా ఈయన క్లాస్‌మేట్.



కోల్‌కతా విశ్వవిద్యాలయం సైన్స్ కాలేజీలో భౌతిక శాస్త్ర ఉపన్యాసకునిగా వున్న సమయంలో మేఘనాధ్ సాహాతో కలిసి నాన్ ఐడియల్ వాయువులకు సంబంధించిన 'సాహా బోస్ సమీకరణం'ను రూపొందించారు. 1921లో ఢాకా విశ్వవిద్యాలయంలో రీడర్‌గా వున్న కాలంలో పొటాన్‌ల గణాంకాలపై రచించిన శాస్త్రీయ పత్రం భౌతిక శాస్త్రంలో విప్లవాత్మక మార్పుకు దారి తీసింది. 'బోస్ గణాంకాలు'గా ప్రసిద్ధి పొందింది. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త పాల్ డిరాక్ ఈ గణాంకాలను అనుసరించే కణాలకు 'బోసాన్' అనే పేరు పెట్టారు. 1924లో ఆయన పారిస్‌లో మేడమ్ క్యూరీ, లూయిస్ డి బ్రోగ్లీతో కలిసి పరిశోధనలు నిర్వహించారు. అనంతరం బెర్లిన్‌లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను కలుసుకున్నారు. బోస్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం, క్రిస్టలోగ్రఫీ, ఫ్లోరసెన్స్, థర్మోల్యూమినెసెన్స్ వంటి రంగాల్లో ముఖ్యమైన పరిశోధనలు చేసారు.

1926లో ఢాకా విశ్వవిద్యాలయంలో ఈసారి ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. తరువాత కోల్‌కత్తాకు తిరిగి వచ్చి ఖైరా ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో 1956 వరకు కొనసాగారు. 1958లో ఆయన రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యారు.

భారత ప్రభుత్వం 1954లో పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించింది.

భారతీయ భౌతిక శాస్త్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చిన మహనీయుడు సత్యేంద్రనాధ్ బోస్ 1974 ఫిబ్రవరి 4న మరణించారు.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998

## "అద్రక్ కే పంజే" - నాటక రంగంలో చిరస్మరణీయ కృతి

బాబన్ ఖాన్ గారు సృష్టించిన "అద్రక్ కే పంజే" నాటకం భారత నాటక చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించింది. 1970 మరియు 1980 దశకాల్లో ఇది దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా కూడా విశేష ఆదరణ పొందింది. అత్యధిక ప్రదర్శనలు సాధించిన నాటకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ నాటకం ప్రత్యేకత ఏమిటంటే, కేవలం రెండు ప్రధాన పాత్రలతోనే ప్రేక్షకులను ఆకట్టుకోవడం. 60 దేశాల్లో 10,000కు పైగా ప్రదర్శనలు నిర్వహించబడటం ఈ నాటక విజయాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా నిలిపింది. బాబన్ ఖాన్ గారి కృషి నాటక రంగంలో చిరస్మరణీయంగా నిలుస్తుంది.






# కోటి విద్యలు కూటి కొరకే

పిల్లలూ సెలవులలో ఏం చేస్తున్నారు. ఆడుతూ, పాడుతూ మీకు ఇష్టమైన వంటకాలు తింటూ ఆనందంగా గడుపుతున్నారనుకుంటున్నా. మనందరం జీవించటానికి గాలి, నీరుతో పాటు ఆహారం చాలా అవసరం. అందుకే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకం ద్వారా పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నారు.

ఇప్పుడు ఈ ఆకలి కేకలు ఎందుకనుకుంటున్నారా!. ప్రపంచవ్యాప్తంగా బాల్యం ఆకలితో అలమటిస్తోంది. దాని వల్ల వారు విద్యకి దూరమౌతున్నారు. దీనికి కారణాలెన్నో. ముందుగా ప్రకృతి విపత్తుల గురించి చెప్పుకోవాలి. అంటే పంట చేతికి వచ్చే కాలంలో అకాల వర్షాలు పడటం. లేదా అధిక వేడి. వీటితో పాటు ప్రపంచయుద్ధాలు, వాటి దుష్ప్రభావాలు. ప్రతి మనిషి తనకు సరిపోయే ఆహారాన్ని పొందడం ఒక 'ప్రాథమిక హక్కు' అని చెప్పుకోవచ్చు. ప్రపంచంలో పది శాతం మంది పిల్లలు ఆకలితోనే పడుకుంటున్నారట. ప్రపంచంలోని దేశాలలోని ఆకలి స్థాయి గురించి అవగాహన కల్పించేందుకు 'ది హంగర్ ప్రాజెక్ట్' అనే లాభరహిత సంస్థ 2011లో మే 28వ తేదీని ప్రపంచ ఆకలి దినోత్సవం (World Hunger Day) గా ప్రకటించింది. ఆకలి అనేది పేదరికంతో ముడిపడి ఉన్న సమస్య. కారణం ఏదైనా ఆహారలోపం వల్ల చిన్నారుల్లో శారీరిక, మేధోపరమైన లోపాలు ఏర్పడుతున్నాయి.

ఈ ఆధునిక ప్రపంచం ఎన్నో రంగాలలో అభివృద్ధి చెందింది. కాని జనం ఆకలిని మాత్రం తీర్చలేక పోతోంది. అంతే కాదు ఎన్నో శాంతి ఒప్పందాలు చేసుకున్నా, యుద్ధాలను ఆపలేకపోతున్నాము. మీరంతా రెండు ప్రపంచయుద్ధాలు, అవి మానవాళికి చేసిన అపారనష్టాల గురించి తెలుసుకొని ఉంటారు. ఆ సంక్షోభం నుండి బయటపడుతున్న సమయంలో ప్రపంచంలో ఏదో ఒక మూల యుద్ధజ్వాలలను చూస్తున్నాం. వీటి వల్ల కల్లాకపటం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవటం చాలా విచారకరం. యుద్ధాల వల్ల ఆహారధాన్యాల ఎగుమతి దిగుమతులకు ఆటంకం ఏర్పడుతుంది. పంటలకు అవసరమయ్యే ఎరువులకు కొరత ఏర్పడుతుంది. తద్వారా పంటలు సరిగా పండవు. పండిన ఆహారధాన్యాల ధరలకు రెక్కలు వస్తాయి. పేదపిల్లలకు తగినంత ఆహారం అందదు. అంటే మనిషిగా జీవించటమే కష్టమైన స్థితిలో స్వేచ్ఛకి, స్వాతంత్రాలకి అర్థం ఉండదు.

"A hungry man is not a free man".

-Adlai E. Stevenson

'గ్లోబల్ హంగర్ ఇండెక్స్' 2025 నివేదిక ప్రకారం ప్రపంచంలో 67 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఎప్పుడైనా మతవిద్వేషాలు, ఉగ్రవాద దాడులు జరిగినా కనిపించని నష్టం జరిగేది చిన్నారులకే అని చెప్పవచ్చు. అందుకే 'వసుధైక కుటుంబకమ్' అన్న భావనతో ప్రపంచం అంతా శాంతికోసం పాటుపడాలి.

సమస్యలను చర్చలతో పరిష్కరించుకోవాలి. ప్రపంచంలో అధికంగా ఆహారాన్ని ఉత్పత్తి చేసే భారతదేశం కూడా ఆకలి సవాళ్లను ఎదుర్కొంటోంది. మనందరం గుర్తు పెట్టుకోవాల్సినది ఆహారాన్ని ఎప్పుడూ వృధా చేయకూడదు.

'ది హంగర్ ప్రాజెక్ట్' , ప్రపంచ ఆకలి దినోత్సవ సంధర్భంగా ప్రతి ఏడాది ఒక కొత్త థీమ్ ను ప్రకటిస్తుంది. ఈ 2026 సంవత్సరపు థీమ్ 'The end of hunger is in our hands'. భాష రాకపోయినా, బంధం అర్థం కాకపోయినా ఆకలి బాధ మాత్రం అందరికీ అర్థమవుతుంది. ప్రపంచ ఆకలి దినోత్సవ సందర్భంగా ఆకలి యొక్క వినాశకర ప్రభావాన్ని గురించి ప్రపంచానికి తెలియజేస్తారు. భారతదేశంలో వికసిత్ భారత్‌లో భాగంగా రైతులను శక్తివంతం చేయాలి. దానికి తగ్గట్టు ప్రభుత్వవిధానాలను రూపొందించాలి. గురజాడ అన్నట్లు "తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడేను మనిషోయ్" అన్న మాటలను మరొకసారి గుర్తుచేసుకుందాం. ఆకలి లేని రాజ్యాన్ని సృష్టిద్దాం. రేపటి పౌరులను కాపాడుకుందాం. దానికి చిన్నాపెద్దా అంతా కలిసి ఏకతాటి పై నడుద్దాం.

"Food is the moral right of all who are born into this world".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

పాట

# గోడమీది బల్లి



గోడమీది బల్లి
గోడ మీదనే దాని లొల్లి
గోడ మీదనే అది ఉంటది
గోడ మీదనే అది తింటది
గోడ మీదనే అది పంతది
గోడ తోనే దాని సహవాసం
గోడ మీదనే దాని ఆవాసం
గోడయే దాని ఇల్లు
గోడతోనే దాని సొల్లు
పురుగులకది శత్రువు
మనుషులదకది మిత్రువు

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.


**ACCOUNT DETAILS :**

Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# ప్రిన్సెస్ నీలోఫర్

## హైదరాబాద్ కోహినూర్, జనహితం కోసం పరితపించే యువరాణి

యువరాణి నీలోఫర్ (1916 జనవరి 4 – 1989 జూన్ 12) ఒట్టోమన్ (ప్రస్తుత టర్కీ) రాకుమారి. 1924లో ఆ రాచ కుటుంబం దేశ బహిష్కరణకు గురికావడంతో తన తల్లితో రెండు సంవత్సరాల వయసులో ఫ్రాన్స్‌లో నీలోఫర్ స్థిరపడ్డారు. హైదరాబాద్ చివరి నిజాం అయిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రెండో కుమారుడు మోజమ్ జా ను 1931లో పెళ్లి చేసుకున్నారు.




నిజాం ఇంటికి ఆధునికతను నీలోఫర్ తీసుకుని వచ్చారు, సంప్రదాయ నిబంధనలను సవాలు చేశారు. సమాజంలో ప్రముఖ వ్యక్తి అయిన ఆమె హైదరాబాద్లో మహిళా సాధికారతకు కృషి చేశారు. విద్యావంతురాలు, సంస్కారి, ఆధునిక మహిళ అయిన నీలోఫర్ పరదాలను, మరుగున ఉండటాన్ని వదిలేయాలని స్త్రీలను ప్రోత్సహించారు. పిల్లలు లేని నీలోఫర్ తన వ్యక్తిగత జీవితంలోని లోటును అందమైన ప్రజా జీవితంతో భర్తీ చేసుకున్నారు. కులీనుల లేడీ హైదరీ క్లబ్లో ఆమె సభ్యురాలు. ఆ క్లబ్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు.

దాతృత్వ కార్యక్రమాలకు కూడా ఆమె నిబద్ధత విస్తరించింది. హైదరాబాద్లో మహిళలు, పిల్లల కోసం నీలోఫర్ ఆసుపత్రిని ప్రారంభించారు.

1952లో విడాకులు తీసుకున్న తరవాత 1963లో ఎడ్వర్డ్ జూలియస్ పోప్ జూనియర్ను నీలోఫర్ పెళ్లి చేసుకున్నారు. 1989లో చనిపోయే వరకు ప్యారిస్లో నివసించారు. ఆమె స్థాపించిన నీలోఫర్ ఆసుపత్రి మహిళల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ఆమె నిబద్ధతకు నిదర్శనం.

– 'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

యువరాణి నీలోఫర్ తన అసాధారణ అందం, ఆకర్షణీయ పనుల కారణంగా 'కోహినూర్ ఆఫ్ హైదరాబాద్' అనే పేరు సంపాదించుకున్నారు.

# అక్షరాలతో ఆటలు

## ఒంటరి అక్షరాలు

ఒకే అక్షరంతో అర్థవంతమైన మాటలు వెతికి పట్టుకోండి

| | | |
|---|---|---|
| ఓం<br>ఓంకారం | శ్రీ<br>గౌరవ పదం | ఆ<br>అది |
| ఈ<br>ఇది | ఊ<br>అలాగే! | ఓ<br>అలాగా? |
| ఏ<br>ఏమిటీ? | జై<br>జై కొట్టు | రా<br>అంతే సంగతులు |
| డీ<br>ఎదుర్కొను | థూ<br>ఉమ్మి వేయు | మే<br>మేక అరుపు |
| కా<br>కాకి అరుపు | రా<br>ఇటు రా | పో<br>అటు పో |
| ఛీ<br>అసహ్యం | తే<br>ఇలా ఇవ్వు | దా<br>ఇలా రా |
| నా<br>నాది | నీ<br>నీది | మా<br>మాది |

– చొక్కాపు వెంకటరమణ
రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
m: 92465 20050

కథ

# చైతు - చంద్రమండల యాత్ర



చైతు మూడవ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ రాత్రి మంచం పై పడుకుని చంద్రుడితో ఎన్నో కబుర్లు చెప్పేవాడు. ఒకరోజు వాడికి చంద్రుడిని అందుకోవాలని అనిపించింది. అదే విషయం అమ్మకు చెప్పాడు. అద్దంలో చంద్రుడిని దగ్గరగా చూపించే ప్రయత్నం చేసింది అమ్మ. అద్దం సాయంతో చంద్రుడిని అందుకోవడం చైతుకి ఇష్టం లేదు. వాడు అమ్మపైన, చంద్రుడిపైన అలిగి పడుకున్నాడు.

కొద్దిసేపటి తర్వాత ఒక పెద్దాయన చైతుని నిద్రలేపాడు.

“ఎవరు మీరు?” అని అడిగాడు చైతు.

“నా పేరు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్. అమెరికా వ్యోమగామిని. చంద్రుడిని చేరిన మొట్టమొదటి మనిషిని నేనే.” అని అన్నాడు ఆ పెద్దాయన.

చైతు కళ్లు తుడుచుకుంటూ ఆశ్చర్యంగా ఆ పెద్దాయన వైపు చూశాడు. “మీరు నిజంగానే చంద్రుడి మీదకు వెళ్లారా?” అని అడిగాడు అమాయకంగా.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ నవ్వుతూ, “అవును, నాతో పాటు వచ్చావంటే నిన్ను కూడా చంద్రుడిపైకి తీసుకుని వెళ్తాను. చంద్రుని విశేషాలు చెబుతాను.” అంటూ చైతు చెయ్యి పట్టుకుని ఆకాశంలోకి ఎగిరాడు. చైతుకి ఒక్కసారిగా గాలిలో తేలుతున్నట్టు అనిపించింది. కొద్దిసేపటికే వాళ్లు తెల్లగా, వెండిలా మెరిసిపోయే ఒక పెద్ద మైదానంలో దిగారు. చైతు చుట్టూ చూశాడు. అక్కడ అంతా పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు ఉన్నాయి. “ఈ గుంతలు, రాళ్లు ఏమిటి?” అని అడిగాడు చైతు. కానీ తన గొంతు తనకే వినబడలేదు.

“ఇక్కడ గాలి ఉండదు. అందుకే శబ్దం ప్రయాణించదు. మనం మాట్లాడుకోవాలంటే ప్రత్యేకమైన యంత్రాలు ఉండాలి.” అంటూ, చైతు చెవి దగ్గర ఒక పరికరాన్ని అమర్చాడు ఆర్మ్‌స్ట్రాంగ్.

చైతు నడవబోయాడు కానీ, అడుగు వేయగానే గాలిలోకి ఎగిరి మళ్ళీ మెల్లగా కిందకు పడుతున్నాడు.

“అదేంటి తాతయ్యా! నేను గాలిలో తేలుతున్నాను?” అని అడిగాడు.

“భూమి మీద ఉన్నంత గురుత్వాకర్షణ శక్తి చంద్రునిపై

ఉండదు. అందుకే మనం ఇక్కడ చాలా తేలికగా ఉంటాం. ఒక చిన్న గెంతు వేస్తే చాలు, చాలా దూరం ఎగిరి పడతాము." అని నవ్వుతూ చెప్పారు ఆర్మ్‌స్ట్రాంగ్.

చంద్రుని ఉపరితలం చైతుకు ఎంతగానో నచ్చింది.

"చూడు చైతూ! 2008లోనే మీ దేశం ఒక ఉపగ్రహాన్ని ఇక్కడికి పంపింది. చంద్రుడి పైన నీటి ఆనవాళ్లు ఉన్నాయని ప్రపంచానికి మొట్టమొదట చాటి చెప్పింది మీ భారతీయులే!" అని ఆర్మ్‌స్ట్రాంగ్ చెప్పారు.

అక్కడ నుండి మరోచోటుకు వెళ్లారు. ఒక చిన్న బండి (రోవర్) చక్రాలతో మెల్లగా కదులుతూ కనిపించింది. "అదిగో చూడు.. అది ప్రజ్ఞాన్ రోవర్! ఇది చంద్రుడి 'దక్షిణ ధృవం' దగ్గర దిగింది. ప్రపంచంలో మరే దేశం కూడా ఇప్పటివరకు ఇక్కడ దిగలేదు. మీ దేశం మాత్రమే ఈ ఘనత సాధించింది." అని ఆయన వివరించారు. ప్రజ్ఞాన్ రోవర్ సాధించిన ఘనత పట్ల చైతుకు గర్వంగా అనిపించింది.

"ఈ రోవర్ దిగిన చోటుకు 'శివశక్తి' అని పేరు పెట్టారు. ఇక్కడ రోవర్ చక్రాలు వెళ్తున్న కొద్దీ చంద్రుడి మట్టిపై భారతదేశ చిహ్నమైన అశోక చక్రం ముద్ర పడుతోంది చూడు!" అని చూపించారు. చైతు అది చూసి చప్పట్లు కొట్టాడు. అక్కడి నుండి చైతును ఒక ఎత్తైన ప్రదేశానికి తీసుకెళ్లి ఆకాశం వైపు చూపించారు ఆర్మ్‌స్ట్రాంగ్. అక్కడ నీలి రంగులో, మెరుస్తూ ఒక అందమైన బంతి కనిపించింది. "అదిగో చూడు.. అదే మన భూమి!" అన్నాడు ఆర్మ్‌స్ట్రాంగ్.

"ఇక్కడి నుండి చూస్తోంటే భూమి చాలా అందంగా కనబడుతోంది తాతయ్య!" అన్నాడు వాడు.

"అవును! భూమిపై నుండి చూస్తే, మనకు చంద్రుడు అందంగా కనబడుతాడు కదా!" నవ్వుతూ అన్నాడు ఆర్మ్‌స్ట్రాంగ్. చైతు మంత్రముగ్ధుడై, అక్కడే నిలబడి ఆ అందమైన దృశ్యాన్ని చూస్తూ నిల్చున్నాడు.

"చైతూ.. లే నాన్న, తెల్లారింది!" అన్న అమ్మ పిలుపుతో చైతు కళ్లు తెరిచాడు. తను మంచం మీద ఉన్నాడు, ఆకాశంలో చంద్రుడు అప్పటికే మసకబారిపోయాడు. కానీ చైతు ముఖంలో మాత్రం పెద్ద నవ్వు. తను అద్దంలో కాదు, నిజంగానే చంద్రుడిని చుట్టేసి వచ్చినంత ఆనందంగా ఉన్నాడు. "అమ్మా! నేను పెద్దయ్యాక సైంటిస్ట్ అయ్యి, నిజంగానే చంద్రుడి మీదకు వెళ్తాను చూడు." అని గట్టిగా చెప్పాడు. అమ్మ మురిసిపోతూ చైతుని దగ్గరకు తీసుకుంది.

– పేట యుగంధర్
చవటగుంట (గ్రామం), వెదురుకుప్పం, చిత్తూరు.
m : 9492571731

## ఆకాశ గూఢచారి – U-2 Dragon Lady విమానం ప్రాముఖ్యత

Lockheed U-2, సాధారణంగా "Dragon Lady"గా పిలవబడే ఈ విమానం, అమెరికా అభివృద్ధి చేసిన అధునాతన గూఢచారి (reconnaissance) విమానం. దీనిని Lockheed Corporation 1950లలో రూపొందించింది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రధానంగా Central Intelligence Agency (CIA) ఆధ్వర్యంలో చేపట్టారు, ముఖ్యంగా Cold War కాలంలో గూఢచారి అవసరాలను తీర్చేందుకు. U-2 విమానం యొక్క ప్రధాన ప్రత్యేకత, అత్యధిక ఎత్తులో ఎగిరే సామర్థ్యం. ఇది సుమారు 70,000 (21 కిమీ) అడుగుల ఎత్తులో స్థిరంగా ప్రయాణించగలదు. చాలా ఎక్కువ సమయం గాల్లో ఉండగలదు. దీనివల్ల శత్రు రాడార్ వ్యవస్థలకు చిక్కకుండా సమాచారాన్ని సేకరించడం సాధ్యమవుతుంది. ఈ విమానంలో అమర్చిన అధునాతన కెమెరాలు, సెన్సింగ్ పరికరాలు భూమిపై ఉన్న సైనిక స్థావరాలు, కదలికలు వంటి కీలక సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేస్తాయి. 1960లో జరిగిన ఒక ప్రముఖ సంఘటనలో, సోవియట్ గగనతలంలో మిషన్ నిర్వహిస్తున్న U-2 విమానం కూల్చబడింది. పైలట్ Francis Gary Powers పట్టుబడటం వల్ల అంతర్జాతీయ స్థాయిలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. "Dragon Lady" అనే పేరు ఈ విమానాన్ని నడపడం అత్యంత క్లిష్టమని సూచిస్తుంది. దీన్ని నడిపే పైలట్లకు విశేష శిక్షణ మరియు నైపుణ్యం అవసరం. నేటికీ, ఈ విమానం గూఢచారి కార్యకలాపాలు మరియు శాస్త్రీయ పరిశోధనలలో కీలక పాత్ర పోషిస్తోంది. U-2 "Dragon Lady" విమానం ఆధునిక వైమానిక గూఢచారి వ్యవస్థలో ఒక ప్రతిష్ఠాత్మక ఆవిష్కరణగా నిలిచింది.





# నమ్మకం

ఒక ఊరిలో ఇద్దరు వ్యాపారులు ఉండేవారు. ఒకరి పేరు రమేష్, మరొకరి పేరు సురేష్. వాళ్ళిద్దరూ పండ్ల వ్యాపారం చేసుకుంటూ ఉండేవారు. రమేష్ ఏమో పుచ్చకాయల వ్యాపారం చేసేవాడు. సురేష్ ఏమో మామిడి పండ్ల వ్యాపారం చేసేవాడు. అలా... వాళ్ల జీవితం గడిపేవారు. రమేష్ పుచ్చకాయలను తక్కువ ధరకు తెచ్చి ఎక్కువ ధరకు అమ్మాలని అనుకునేవారు. కానీ, సురేష్ మాత్రం మామిడికాయలను సరైన ధరకు కొని తన వ్యాపారాన్ని కొనసాగించే వాడు. ఒకరోజు రమేష్ మార్కెట్ నుండి బాగాలేని పుచ్చకాయలను తెచ్చి ఒకటి కొంటె ఒకటి ఉచితం అని చెప్పాలనుకున్నాడు. అయితే అతని పుచ్చకాయలు బాగా అమ్ముడుపోయాయి కానీ, తిన్న వాళ్ళందరికి విరోచనాలు అయ్యాయి, మోసపోయామని, అతనిని బాగా తిట్టారు. సురేష్ మాత్రం మామిడి పండ్లను శుభ్రంగా కడిగి అమ్మేవాడు. కొనడానికి వచ్చిన వాళ్ళందరికి ఇలా చెప్పేవాడు. ఒక కాయ కొని చూడు... నచ్చితేనే... డబ్బులు ఇవ్వు అని, చెప్పాడు. అలా అందరూ మామిడి పండ్లను కొనేవారు రుచి నచ్చి సురేష్ వ్యాపారానికి మంచి పేరు వచ్చింది. రమేష్ వ్యాపారం మాత్రం దెబ్బ తిన్నది. సురేష్ వ్యాపారం మాత్రం నిజాయితీగా కొనసాగింది. ఎప్పుడైనా సరే వ్యాపారానికి నమ్మకం అవసరం.

– పల్లపు గాయత్రి
7వ తరగతి ఉన్నత పాఠశాల కొమరబండ, కోదాడ.



# మంచి స్నేహితులు

ఒక ఊరిలో రమణ, అరుణ్, కృష్ణ మంచి స్నేహితులు. వారు చాలా మంచివారు. ఒక రోజు వారు ఆడుకుంటూ ఉండగా గ్రౌండ్‌లో దూరంగా రామ్ చరణ్ కింద పడిపోయి ఏడవడం ప్రారంభించాడు. ఆడుకుంటున్న వారు వెంటనే వచ్చి అతన్ని లేపి ధైర్యం చెప్పారు.

ఒకరు అతనికి నీళ్ళు ఇచ్చాడు. అందరూ కలిసి అతన్ని ఇంటికి తీసుకెళ్లారు. రామ్‌చరణ్‌కు డబ్బుందని, తరగతిలో గర్వం. చదువులో మాత్రం వెనకనే.

అయినా రామ్‌చరణ్ ధనవంతుడని కాపాడలేదు. తమ తరగతి వాడని, ఆపదలు, కష్టాలు అందరికీ వస్తాయని సాటి మనిషని గౌరవం, ప్రేమతో ఇంటికి తీసుకువెళ్లారు.

డబ్బులున్నాయని గర్వం. ఉండే కాని మీ వంటి వారు మిత్రులుగా ఉంటే ధనం కంటే ఎక్కువ అని రామ్‌చరణ్ అన్నాడు.

– యం. రోహిత్
7వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్ బాలుర
m: 9573432434

ఆట

# గచ్చకాయలు



**ఎంత మంది పాల్గొనవచ్చు** - నాలుగు నుంచి ఐదుగురు అయితే బాగుంటుంది (ఒక్కరు కూడా ఆడుకోవచ్చు)

**ఎక్కడ ఆడవచ్చు** - ఎక్కడైనా కూర్చుని ఆడుకునే అనువైన ఆట

**ఈ ఆటకు గల ఇతర పేర్లు** - ఐదురాళ్ళ ఆట, గచ్చ గిల్లలు, అచ్చెన గండ్లు

'గచ్చకాయలు' ఆటను నున్నటి పాలరాళ్ళతో ఆడతారు. పల్లెటూర్లలో గులకరాళ్ళను, నున్నగా చేసుకుని వాటితో ఆడతారు. సామాన్యంగా 5 కాయలతో ఆడతారు. ఈ ఆట ఒకటింగాయలు, రెండుంగాయలు, మూడుంగాయలు అని వివిధ "దశ"లుగా ఆడతారు. అయితే అన్ని దశలు ఒకదాని తరువాత ఒకటి ఆడాలి. ఎక్కడైనా రాయి క్రిందపడినా, ఆట తప్పినా రెండో వాళ్ళు ఆడాలి.

**ఒకటో దశ :** ఒక గచ్చకాయ పైకి ఎగర వేసి మిగతా నాలుగు రాళ్ళు ఒక దగ్గర కుప్పగా ఉంచి, ఎగర వేసిన కాయను పట్టుకోవాలి. వెంటనే చేతిలో ఉన్న రాయిని మళ్ళీ పైకి వేసి కింద ఉన్న నాలుగు కాయలను తీసుకుని పైకి వేసిన కాయను కూడా పట్టుకోవాలి. ఇది మొత్తం సరిగ్గా చేయగలిగితే ఒక పాయింటు వస్తుంది. పైకి వేసిన కాయను పట్టుకోకపోయినా, నాలుగు కాయల్ని చేతితో తీసుకోకపోయినా ఆటపోయినట్టు. అప్పటి వరకు గెలిచిన పాయింట్లు ఉంటాయి. తరువాత వాళ్ళు ఆట మొదలు పెడతారు.

**రెండో దశ :** రెండో దశలో మొదటి దానిలో కాయల్ని ఒక్క దగ్గర కుప్ప మాదిరి పెట్టకుండా మెల్లగా కింద వదలాలి. అలా వదిలిన వాటిలో మూడు కాయల్ని మాత్రమే తీసుకుని పైకి ఎగరేసిన కాయను పట్టుకోవాలి. మూడు కాయల్ని తీసుకున్నప్పుడు నాలుగో కాయ కదలకూడదు. నాలుగో కాయ కదిలినా, మూడు కాయలు పట్టుకోలేక పోయినా ఆట పోయినట్టు. తరువాతవాళ్ళు ఆట మొదలు పెడతారు.

**మూడో దశ :** ఇందులో ఒక కాయ పైకి ఎగరేసి నాలుగు కాయల్ని మెల్లిగా నేలమీద వదలాలి. తరువాత ఒక కాయ ఎగరేసి రెండు కాయల్ని పట్టుకుని మళ్ళీ ఎగరేసిన కాయను పట్టుకోవాలి. ఆ తరువాత చేతిలో ఉన్న మూడు కాయలనూ ఎగరేసి, మిగతా రెండు కాయలను చేతిలో తీసుకుని పైకి ఎగరేసిన మూడు కాయలనూ పట్టుకోవాలి. మొత్తం సరిగ్గా చేయగలితే ఒక పాయింటు. దీనిని రెండుంగాయలు అంటారు.

**నాలుగో దశ :** ఇందులో మొదటిసారి ఒక కాయ పైకి ఎగరేసి మిగతా నాలుగు కాయలు కుప్పగా కాక వేరు వేరుగా పడేట్లు కాయలను వదలాలి. మళ్ళీ ఒక కాయను ఎగరేసి ఇంకొక కాయను పట్టుకుని ఎగరేసిన కాయను కూడా పట్టుకోవాలి. ఒక కాయను తీసిన తరువాత రెండు కాయలను ఎగరేసి ఇంకొక కాయను తీసి ఈ రెండు కాయల్ని పట్టుకోవాలి. అదే విధంగా మూడు కాయల్ని నాలుగు కాయల్ని ఎగరేసి ఒక్కొక్క కాయ తీసి ఎగరేసిన కాయలను పట్టుకోవాలి. మొత్తం సరిగ్గా చేయగలిగితే ఒక పాయింటు. అన్ని దశలలో ఎవరికి ముందుగా ఎక్కువ పాయింట్లు వస్తే వాళ్ళు గెలిచినట్లు.

**ప్రయోజనం:** ఈ ఆటకు కళ్ళకి చేతులకి సమన్వయము బాగా అవసరము. పాయింట్లు లెక్క పెట్టటము, కూడికలు వేయటము వస్తాయి. ఈ ఆటద్వారా ఏదైనా ఒక పని చేపట్టినప్పుడు ఒక దశ పూర్తయిన తరువాత, రాబోయే దశలు కొంచెము కష్టముగా ఉంటాయని తెలుస్తుంది.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...




# బంగారు మర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

'ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల ఉన్న రావిర్యాల, ఆదిభట్ల, కొంగర కలాన్, నాదర్‌గుల్ గ్రామ వాసులకు విజ్ఞప్తి.. ఈ పరిసర ప్రాంతాల్లో ఒక మగ పులి తిరుగుతుంది కాబట్టే చిన్న పిల్లల్ని జాగ్రత్తగా కనిపెట్టకుని ఉండాలి! కల్లాల్లోకి, పొలాల్లోకి వెళ్లేవారు ఒంటరిగా పోవద్దని హెచ్చరిస్తున్నా మహో!' అంటూ డప్పు చాటింపు వినపడింది.

డప్పు చప్పుడుకు నిద్ర లేచి కూర్చున్నాడు చింటూ. ఎదురుగా పెద్ద అక్షరాలతో, పెద్ద శబ్దాలతో బ్రేకింగ్ న్యూస్. రాజేంద్రనగర్‌లో పులి దాడిని చూపిస్తూ పోలీసు, అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. పులిని చూపిస్తూ అదే వార్త పదేపదే టీవీలో ప్రసారం చేస్తున్నారు.

చింటూ పక్కనే ఉన్న వాళ్ళ నాన్నతో "నాన్నా! టైగర్ అడవిలో కదా ఉండాల్సింది! సిటీకి ఎందుకు వచ్చింది" అడిగాడు బెడ్ మీద నుంచి లేస్తూ.

"అడవిలో ఉండే ఏ జంతువైనా ఫుడ్, వాటర్, షెల్టర్‌కు యిబ్బంది ఐతే ఇలా బయటకు వస్తుంటాయి" అన్నాడు తండ్రి రాంబాబు.

చింటూకి బూస్ట్ పాలు యిచ్చింది తల్లి పావని.

చింటూ నాదర్ గుల్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చదువులో తెలివితేటల్లో చాలా చురుకుగా ఉంటాడు. తన క్లాసులో ఎప్పుడు మొదటి ర్యాంకు తెచ్చుకుంటాడు. పరిసరాలు గమనించటం, ప్రకృతిని ప్రేమించడం, తెలియని విషయాలు తెలుసుకోవడం చింటూకి మొదటి నుంచీ అలవాటు. చింటూ తండ్రి రాంబాబు రాజేంద్రనగర్‌లోని కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఒక బిస్కెట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రతిరోజూ నాదర్‌గుల్ నుంచి కాటేదాన్‌కు టూ వీలర్ మీద వెళ్లి వస్తుంటాడు.

"ఏమండీ! పులి నిన్న రాత్రి రాజేంద్ర నగర్ లోనే దాడి చేసిందటగా! అది మీ ఫ్యాక్టరీకి చాలా దగ్గర. రాత్రి ఇంటికి వచ్చేటప్పుడు ఒంటరిగా రాకండి. బండి మీద కన్నా బస్సులో వెళ్తే బాగుంటుందేమో ఆలోచించండి" అంది భార్య పావని. "చూడు! పులే కాదు! ఏ జంతువు కూడా మనము వాటిని ఏమి చేయకుంటే అవి మనల్ని ఏమీ చేయవు. నువ్వేం భయపడకు! నేను జాగ్రత్తగానే వెళ్లి వస్తాను" అన్నాడు రాంబాబు. పావని మాట్లాడలేదు.

బిస్కెట్ ఫాక్టరీకి వెళుతూ చింటూని బడిలో దించాడు రాంబాబు. బడిలో పిల్లలు కూడా పులి గురించే మాట్లాడు కుంటున్నారు.

తరగతి గదిలో 'పిల్లలూ! మీకు ఏ అడవి జంతువంటే ఇష్టం!?' అడిగారు మాష్టారు. ఒక పిల్లవాడు సింహం అంటే మరొకడు ఏనుగు అన్నాడు. ఎక్కువ మంది పిల్లలు మాత్రం పులే తమ ఫేవరెట్ అని చెప్పారు.

"ఐతే ఈ రోజు మనం పులి గురించి కొంత చెప్పుకుందామర్రా!"

"అలాగే మాష్టారూ!" అన్నారంతా.

"నిన్నరాత్రి రాజేంద్రనగర్‌లో పులి దాడి చేసింది. మీకు తెలుసా!?"

"తెలుసు మాష్టారు! టీవీలో చూశాం. పులి మనిషిని చంపుతుందా మాష్టారూ?" అడిగాడు చింటూ.

"ఆత్మరక్షణ కోసం మాత్రమే పులి దాడి చేస్తోంది, పులి ఆహారచక్రంలో రెండు కాళ్ల మానవుడు లేడు. నాలుగు కాళ్ల జంతువును మాత్రమే పులి దాడి చేస్తుంది."

"ఐతే పులి మనల్ని చంపి తినదా!?"

"అవునర్రా! చంపదు. ఆకలైతే చెదపురుగుల నుంచి ఏనుగు వరకు చంపి తింటుంది. పులి పర్యావరణ సమతుల్యానికి 'జీవగర్ర' భారతదేశ జాతీయ జంతువు కూడా పులే" అన్నారు మాస్టారు.

"పులికి చాలా బలం ఉంటుందటగా మాష్టారూ?"

"అవునర్రా! పులి పంజా చాలా శక్తి వంతమైనది. ఒకసారి పులి పంజా విసిరితే దాని బలం ఒకటిన్నర టన్నుల వరకు ఉంటుంది. అంతటి శక్తివంతమైన పులి పంజాకు ఎదుటి జంతువు ఏదైనా చీలిపోవాల్సిందే!" అన్నారు మాష్టారు.

ఆ రోజు నగరం అంతా పులి గురించే మాట్లాడుకుంది. ఏ నలుగురు కలిసినా పులి ఎటు వెళ్లిందనే చర్చ కొనసాగింది. రాజేంద్రనగర్ మొత్తం అటవీ అధికారులు గస్తి తిరిగారు. కానీ, పులిజాడ దొరకలేదు. అక్కడక్కడ పులి పాదముద్రలు కనిపించాయి. పులిని బంధించటానికి రెండు చోట్ల పులి బోనులు ఏర్పాటు చేశారు.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చాడు రాంబాబు. పులిని పట్టుకోటానికి సిబ్బంది ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో టీవిలో వస్తున్న వార్తలు చూస్తూ పావని, రాంబాబు, చింటూ భోజనం చేస్తున్నారు.

ఇంతలో బ్రేకింగ్ న్యూస్ 'పులి ఔటర్ రింగ్ రోడ్డు ఆనుకుని ఉన్న ఆదిభట్ల రోడ్డు మీద తిరుగుతూ సిసి కెమేరాలో కనిపించింది. బోన్లతో, మత్తు ఇంజెక్షన్ ఇచ్చే గన్స్‌తో పులి వేట కొనసాగిస్తున్నారు'.

"ఏమండీ ఆదిభట్ల పక్కనే మనం ఉండే నాదర్ గుల్. పులి రోజుకు ఇరవై నుండి ముప్పయి కిలో మీటర్లు తిరుగుతుందటగా!" అంది పావని.

"అవును. మనం ఇంట్లోంచి బయటకు పోకపోవటమే మంచిది" అన్నాడు రాంబాబు. (సశేషం...)

- పైడిమర్రి రామకృష్ణ
m : 92475 64699

క
థ

# గురుదక్షిణ



పెరవలి గ్రామంలో రంగనాథస్వామి గుడి ఉండేది. ఆ గుడి దగ్గరలోనే రంగయ్య అనే అతను ఉండేవాడు. ఆ ఊర్లో చదువుకున్న వాడు అతనొక్కడే. అతను సాయంత్రం ఉదయం ఇల్లిల్లు తిరిగి పెద్దలను కలిసి "మీ పిల్లల్ని చదువు కోవడానికి నా దగ్గరకు పంపించండి. వాళ్లు బాగా చదువుకుంటే ఉన్నత స్థానంలోకి వస్తారు. మిమ్మల్ని బాగా చూసుకుంటారు. మీకు మంచి పేరు తెచ్చి పెడతారు. ఎవరు మోసం చేయకుండా మనలను కాపాడు కోవచ్చు," అని తల్లిదండ్రులని ఒప్పించి పిల్లల్ని బడికి వచ్చేలా చేశారు. బడికి వచ్చే పిల్లలందరూ రానురాను బాగా చదువుకునేవారు. అంతే బాగా అల్లరి చేసే వారు. గొడవపడి కొట్టుకునే వారు. పలకలు విరగ కొట్టుకొనేవారు. పుస్తకాలను చింపుకునేవారు. ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పేవారు. దానితో వారు బయటికి వచ్చి గొడవ దిగినప్పుడు సర్ది చెప్పి పంపేవారు పంతులుగారు.

తల్లిదండ్రులు నెల ఫీజు ఎంత ఇచ్చినా తీసుకునేవాడు. ఇవ్వకపోతే బాధించేవాడు కాదు. పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి పెరిగింది. చదువుతో పాటు ఆటలు పాటలు బాగా నేర్చుకునే వారు. ఈ మార్పును చూసి గ్రామ ప్రజలు సంతోషించేవారు. ఒక రోజు ఉదయం ఐదో తరగతి పిల్లలకు పాఠాలు చెబుతుండగా పంతులుగారు ఎక్కువగా దగ్గుతూ ఉన్నారు. ఇది వరకు అప్పుడప్పుడు మాత్రమే దగ్గేవారు.

రోజురోజుకు దగ్గు పెరిగిపోయింది. ఒక చోట కూర్చుని చెప్పలేక నిలబడి పాఠం చెప్పాలనుకున్నా చెప్పడం కష్టమవుతుంది. గురువు గారిని చూసి పిల్లలు భయపడ్డారు. దసరా సెలవులు వచ్చాయి. దసరా సెలవుల తర్వాత పిల్లలందరూ బడికి వచ్చారు. గురువుగారు మంచంలో లేవలేని స్థితిలో ఉన్నారు. ఐదో తరగతి పిల్లలు గురువుగారి దగ్గరకు వచ్చి ఒక మూట ఇచ్చారు. రంగయ్య మూటను విప్పి చూస్తే పావలాలు, అర్ధరూపాయలు, రూపాయల నోట్లు కనిపించాయి. కొన్ని బిల్లలు కింద పడిపోయాయి. ఇవన్నీ ఎక్కడివి ఎవరిచ్చారు..? నాకు ఎందుకు ఇస్తున్నారు..? అని దగ్గుతూ అన్నారు గురువుగారు.

సెలవులు ఇచ్చిన రెండు రోజులకి ఓ రోజు సాయంత్రం మేము మిమ్మల్ని కలవడానికి మీ ఇంటికి వచ్చాము. మీరు ఆ సమయంలో అమ్మగారితో చెప్పిన మాటలు విన్నాం. మీరు రామాపురానికి వైద్యుడి దగ్గరికి చూపించుకోవడానికి వెళ్లారని. వైద్యుడు మీకు టీబీ వ్యాధి వచ్చిందని ఆ వ్యాధికి మందులు వాడకపోతే రెండు, మూడు నెలల్లో చనిపోతాడని అవి చాలా ఖరీదైనవని వేల రూపాయలు రూపాయల ఖర్చవుతుందని అమ్మగారితో చెబుతుంటే విన్నాము. మీకు తెలియకుండా మేమంతా సమావేశమయ్యాం. ఏమి చేయాలో చర్చించుకొని మీకు ఎలాగైనా సహాయం చేయాలి అనుకున్నాం. ఎలాగూ దసరా పండుగ వస్తుంది. దసరా వేషాలు వేసి, ఇంటింటా పాటలు పాడి ఈ డబ్బులు సమీకరించాము. విప్పిన మూటను మరల ముడివేసి ఆ పిల్లలకి గురువుగారు తిరిగి ఇస్తూ..." ఎందుకు నాయనా మీకు ఇంత శ్రమ. నేనే ఎలాగోలా గ్రామపెద్దల కాళ్లావేళ్లా పడి డబ్బులు అప్పు తీసుకుని వైద్యం చేయించుకుంటాను." "మీరు మాకు వెనక్కు ఇచ్చిన మేము తీసుకోము. మేము ఇచ్చే డబ్బులు ఊరకనే ఇవ్వడంలేదు. మాకు విద్యాబుద్ధులు నేర్పేందుకు "గురుదక్షిణగా" ఇస్తున్నాము. తీసుకోండి. మీకు వ్యాధి బాగా అయితే మాలాంటి పిల్లలకు మంచి చదువు చెప్పి మంచి మంచి బుద్ధులు నేర్పుతారు. ఇది మీరు నేర్పిన విద్యే గురువు గారు" అన్నారు పిల్లలు.


అప్పుడు అమ్మగారు కన్నీరు తుడుచుకుంటూ "కాదనకండి...! ఈ పిల్లలు దేవుళ్లతో సమానం. ఆ దేవుడే మనకు ఈ పిల్లల రూపంలో వచ్చారు. అందరూ ఒకే మాట మీద ఉండడంతో గురువుగారు మరేం చేయలేక ఆ డబ్బులు తీసుకుని వైద్యం కోసం నగరానికి వెళ్లారు.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025, 'యువత రాసిన పిల్లల కథలు'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

**- పుల్లా మురళీ ఆకాశ్**

ఎం. ఎ, సోషియాలజీ, మొదటి సంవత్సరం, కర్నూలు
m: 78158 01257

# పక్షి- కోతుల కథ




ఒక అడవిలో ఒక జమ్మి చెట్టు ఉంది. దాని మీద ఒక పక్షి నివసించేది. అది చలికాలం, పైగా జోరుగా వాన కురిసింది. అందువల్ల చలి మరింతగా పెరిగింది. ఆ అడవిలో ఒక కోతుల గుంపు ఉంది. ఆ కోతులు ఆ వానలో ముద్దగా తడిసిపోయాయి. చలి భరించలేక గజగజ వణుకుతూ వచ్చి ఆ చెట్టు క్రింద చేరాయి.

ఆ సమయానికి చీకటి పడడంతో మిణుగురు పురుగులు అడవిలో ఎగురుతున్నాయి. ఆ మెరుస్తున్న మిణుగురు పురుగులను చూచి కోతులు ఆ పురుగులలో నిప్పు ఉందని అనుకున్నాయి. వాటితో నిప్పు రాజేసి చలిమంట వేసుకుందామని ఆలోచించాయి. అడవిలో తిరిగి పుల్లలు ఏరుకు వచ్చాయి. ఆ మిణుగురు పురుగులను తెచ్చి వాటి చుట్టూ పుల్లలను ఉంచి ఊదటం ప్రారంభించాయి. ఎంత సేపు శ్రమపడినా మంట రగులుకోలేదు. కోతుల చలి తీరలేదు. ఇదంతా చెట్టు మీద ఉన్న ఆ పక్షి చూస్తోంది. దానికి ఆ పురుగులలో నిప్పు ఉండదని తెలుసు. చాలా సేపు చూసి, చివరకు ఆ పక్షి ఊరుకోలేక ఆ కోతులతో, "అది నిప్పు కాదు మిణుగురు పురుగుల కుప్ప. వాటితో మీ చలి తీరదు. మీ చలి తీరాలంటే నిప్పు సంపాదించండి" అని సలహా ఇచ్చింది.

ఆ సలహా విని ఒక మూర్ఖపు కోతి, "నువ్వా పక్షీ! నాకు సలహా చెప్పేదానివి?" అంటూ కోపంగా చెట్టెక్కి పక్షి గూటిని నాశనం చేసింది.

**నీతి : ఎవరికి పడితే వారికి ఉచిత సలహాలు ఇవ్వకూడదు.**

సేకరణ : అమరావతి




మేధకు మేత
చదువు మార్చు రాత
పెట్టకు కోత

నైపుణ్య జ్ఞానం
భుక్తి భక్తి జీవనం
రక్షా కవచం

జ్ఞానపు దారి
చీకటి చీల్చు సూరి
చదువేమరి

వెల్గుల తావు
అందరికి చదువు
నేతల పూచీ

– రేడియమ్
m: 9291527757




## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# బుద్ధవనం (తెలుగు ప్రజల బౌద్ధ వారసత్వ ప్రతీక)

సామాన్య పూర్వశకం 5వ శతాబ్ధంలో బుద్ధుని జీవిత కాలంలోనే తెలంగాణలలోకి బౌద్ధం ప్రవేశించి, తెలుగు నేలంతా సుమారుగా 300లకు పైగా బౌద్ధ చారిత్రక ప్రదేశాలుగా గుర్తించబడిన వాటిని నేటికి మనం చూస్తున్నాం. చాలా వరకు బౌద్ధ స్థలాలు నాటి చారిత్రక ఆనవాళ్ళను కోల్పోయి, అవి శిథిల గోడలుగా, విరిగిన శిల్పాలుగా వివిధ మ్యూజియాలలో, ఇంకా కొన్ని నేల పొరలలో మనకు నేడు కన్పిస్తున్నాయి. భారతీయ శిల్పకళలో తొలి మూడు రకాల శిల్పకళలలైన గాంధార, మధుర, అమరావతి శిల్పకళలలో అలనాటి మేటి శిల్పకళాశైలిగా గుర్తింపు పొందిన అమరావతి శిల్పకళకు అద్దం పట్టేలా నాటి శైలిని అసలు శిల్పులు కూడా మరిచిపోయిన సందర్భంలో బుద్ధవనంలో సుమారు 1700 సంవత్సరాల తర్వాత నాటి అమరావతి శిల్పకళను, అలాగే ఆ శిల్పకళలో అత్యున్నత దశకు నిలయమైన ఫణిగిరి బౌద్ధ శిల్పకళా సాంప్రదాయాన్ని కూడా పునరుద్ధరింపజేయడం జరిగింది.

విశ్వనగరంగా కీర్తి గడిస్తున్న హైదరాబాద్ రాజధాని నగరానికి, అలాగే మరో విశ్వనగరంగా నిర్మాణం జరుపుకుంటున్న తెలుగు ప్రజల మరో నాటి చారిత్రక నేటి రాజధాని అమరావతికి సుమారు 150 కి.మీ. దూరంలో, క్రిష్ణానది తీరంలో, నాగార్జున సాగర్ డ్యాంకు ఎడమగట్టున, బుద్ధవనానికి రూపకల్పన జరిగింది. ఎందుకంటే నాటి సామాన్య శకం 3వ శతాబ్దంలో, ఇక్ష్వాకుల కాలంలో, శ్రీపర్వత విజయపురి పేరుతో రాజధానిగా వెలుగొంది, మహాయాన బౌద్ధకేంద్రంగా వెలసిల్లి, ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల అది! నాటి బౌద్ధ సంస్కృతిని, కట్టడాలను, శిల్పాలను బుద్ధుని జీవిత చరిత్ర రూపంలో, జాతక కథలుగా అతని శాంతి సందేశాన్ని నేటి తరాలకు మార్గదర్శనం చేయాలని, భవిష్యత్తు తరాలకీ నాటి బౌద్ధ సంస్కృతిని అందించాలనే ఉద్దేశంతో నిర్మాణం చేసిందే బుద్ధవనం. ఈ నిర్మాణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ 274 ఎకరాల విస్తీర్ణంలో నాటి బౌద్ధ సంస్కృతిని ఒకే ప్రదేశంలో చూసే విధంగా, ప్రజలందరికి ముఖ్యంగా పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు నాటి బౌద్ధ చారిత్రక సంస్కృతిపై అవగాహన కల్పించాలని, బుద్ధుని త్రిరత్నాలు, చతురార్య సత్యాలు, పంచశీల, ఆర్య అష్టాంగ మార్గాలు అడుగడుగునా అందరికీ అర్థమయ్యే రీతిలో బుద్ధవనం రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టును 8 విభాగాలుగా రూపకల్పన చేసి 2003 - 2004 సం॥లో అప్పటి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఆంజనేయ రెడ్డి, IPS (R) ఆధ్వర్యంలో మొదలయిన పనులు ముందుగా స్వాగత ద్వారం, బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూపవనం, మహాస్థూప అనే విభాగాలు ప్రస్తుతానికి పూర్తి అయి పర్యాటకులకు అందుబాటులోనికి వచ్చాయి. స్వాగత ద్వారంలో రోడ్డుకు ఆనుకొని పార్కింగ్, ఫుడ్ కోర్టు, వసతి సదుపాయాలతో పాటుగా భారీ ఏనుగు శిల్పాలు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. తెలుగు సంస్కృతికి ప్రతీక అయిన బోనాలు, బతుకమ్మ, సంక్రాంతి శిల్పాలు, నాలుగు ద్వారాలు గల లోపలి గోడలపై బౌద్ధంపై పర్యాటకులకు ప్రాథమిక అవగాహన కల్గించే ధేరవాద, మహయాన శిల్పాలు, అందరినీ ఆకర్షించే ధర్మచక్రం స్థంభం ఇక్కడ ప్రత్యేకం. బుద్ధచరిత వనంలో సిద్ధార్థుని జననం నుండి మహాపరి నిర్వాణం వరకు, బుద్ధుని జీవిత ఘట్టాలను లోహ శిల్పాలుగా ఏర్పాటు చేయడమైనది. బుద్ధుని పాదాలు, శ్రీలంక ప్రభుత్వం బహుకరించిన ధమ్మగంట, పరమ పూజ్య దలైలామా గారు 2006లో నాటిన భోదివృక్షం ఇందులో ప్రత్యేక ఆకర్షణలు. జాతకవనంలో బుద్ధుని గత జన్మలైన భోదిసత్వుని 40 జాతక కథల శిల్ప ఫలకాలు పిల్లలకు, పెద్దలకు దశపారమితలైన మానవత్వ విలువలను బోధిస్తాయి. మధ్యలో గల మహాస్థూప శిల్ప కుడ్యం ఇందులో మరో ప్రత్యేకాకర్షణ. ధ్యానవనంలో శ్రీలంక ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 అడుగుల అవుకాన బుద్ధ నిలబడిన బుద్ధుని విగ్రహం అందరినీ ఆకర్షిస్తుంది. స్థూపవనంలో భారతదేశంలోని 5 (ఐదు), తూర్పు దక్షిణాసియా దేశాలవి 8 (ఎనిమిది) స్థూప నమూనాలు మనకు ఆయా దేశాల బౌద్ధం స్థూపాలను పరిచయం చేస్తాయి. బుద్ధవనానికి హృదయ స్థానం అయిన మహాస్థూపం యొక్క నిర్మాణం బయట గల మూడు ఎత్తులలో ప్రదక్షిణా మార్గాలు గల శిల్ప ఫలకాలు బుద్ధుని జీవిత చరిత్ర. జాతక కథలు, అష్టమంగళ చిహ్నాలు, త్రిరత్నాలు, పూర్ణకుంభాలు, స్థూపం లోపల అద్భుతమైన ఆధునిక సాంకేతిక నిర్మాణం ఆకాశ దృశ్యం, తామరరేకులు, పంచధ్యాని ముద్రలతో కూడిన మరో స్థూపం, బుద్ధుని శిల్పాలు మనలందరికి బౌద్ధ ఆధ్యాత్మికతను పంచడంతో పాటు మానసిక ప్రశాంతతను కలుగుజేస్తాయి. ఈ శిల్పాలన్నింటిని ఆళ్ళగడ్డకు చెందిన ప్రముఖ శిల్పులు దురుగడ్డ హరిప్రసాద్, హర్షవర్ధన్‌లు సుమారు 227 మంది శిల్పులతో 8 సంవత్సరాల పాటు ఎన్నో ప్రయాసలకోర్చి శిల్పకళా శోభితంగా తీర్చిదిద్దారు. మరిన్ని వివరాలు తరువాత తెలుసుకుందాం.


– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

# బజర్

ఇంట్లోనే తయారు చేసుకోదగ్గ బజర్‌కి "రాక్షసుడి గుహలో రాజకుమారి" గారడీలో వివరించిన విద్యుదయస్కాంత సామాగ్రి, సీనా రేకు ముక్క, రబ్బరు బ్యాండ్, స్క్రూ మేకు, కర్ర పలక, మేకులు కావాలి.

సీనా రేకు డబ్బా నుంచి కత్తిరించిన 2. 5 సెం. మీ. వెడల్పు, 15 సెం. మీ. పొడవు కలిగిన రేకు ముక్క తీసుకుని, దీని ఒక కొస బల్ల మీద కొట్టిన పెద్ద ముక్కకి చుట్టి స్థిరంగా ఉండేటట్లు చెయ్యాలి. ఈ కొసకి సుమారు 5 సెం. మీ. దూరంలో కొట్టిన చిన్న మేకుకి కట్టిన రబ్బరు బ్యాండు ఈ రేకు ముక్కని తన వైపు లాక్కుంటుంది. ఈ రేకు రెండవ కొస చెక్కలో నుంచి పొడుచుకు వచ్చిన స్క్రూ మేకు మొనకి తగులుతూ ఉంటుంది. విద్యుదయస్కాంతం, స్విచ్చి, బేటరీ, పెద్ద మేకు, స్క్రూ మేకు బొమ్మలో చూపినట్లు రాగి తీగలతో కలపాలి. ఈ విధంగా అమర్చి, స్విచ్చి వేస్తే బేటరీ నుంచి పెద్ద మేకుకి, దాని నుంచి రేకు ముక్క ద్వారా స్క్రూ మేకుకి, దాని నుంచి అయస్కాంతపు తీగ చుట్టకీ, దాని నుంచి స్విచ్చి ద్వారా బేటరికీ విద్యుత్ వలయం పూర్తి అయి, కరెంటు ప్రవహిస్తుంది. కానీ, ఈ పరిస్థితి ఎంతో సేపు నిలవదు; ఏమంటే – తీగ చుట్టలో విద్యుత్తు ప్రవహించగానే ఇనప బోల్టు అయస్కాంతంగా మారి, స్క్రూ మేకును అతుక్కుని

ఉన్న రేకుముక్కను తన వైపు లాక్కుంటుంది. దానితో విద్యుత్ వలయం తెగిపోతుంది; తీగచుట్టలో కరెంటు ప్రవహించక ఇనప బోల్టు అయస్కాంత ధర్మాన్ని కోల్పోతుంది. రబ్బరు బ్యాండు లాగుతూ ఉండటం వల్ల రేకుముక్క ఇనప బోల్టును వదిలి, వెనక్కి వచ్చి, స్క్రూ మేకు మొనకి తగులుతుంది. దానితో వలయం పూర్తి అయి మళ్లీ విద్యుత్తు ప్రవహించడం మొదలు పెడుతుంది. ఈ విధంగా విద్యుత్ వలయం పూర్తి అవుతూ, తెగిపోతూ, పూర్తి అవుతూ, తెగిపోతూ ఉంటుంది. ఇందువల్ల సీనారేకు ముక్క ముందుకీ వెనక్కీ కదులుతూ, కంపిస్తూ ఉంటుంది. ఈ ప్రకంపనాల వల్ల స్విచ్చి వేసి ఉన్నంతసేపూ బజ్‌జ్‌జ్ మనే ధ్వని వస్తుంది.




బజర్ సరిగ్గా పని చెయ్యడానికి ఇందులో స్క్రూ మేకు మొన, ఇనప బోల్టుల స్థానాలను అవసరాన్ని బట్టి తగినంతగా సరిదిద్దాల్సి ఉంటుంది. రేకు ముక్క టెన్షన్‌ని బట్టి, రబ్బరు బ్యాండు బలాన్ని బట్టీ బజర్ మోత నిర్ణయమవుతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

## బొమ్మలేద్దామా...




కె. తన్మయశ్రీ,
8వ తరగతి, జెపిహెచ్‌ఎస్ అవునూరు, ముస్తాబాద్, రాజన్న సిరిసిల్లా



# కొత్త మిత్రులు

**7పాత్రలు: ధీరజ్ - సాక్సమ్మ, ష్యూసమ్మ, తరుణ - బ్యాగయ్య**

ధీరజ్ : అమ్మా అమ్మా (బ్యాగు వేలాడేసుకుంటూ వస్తాడు)

తరుణి : వచ్చావా నాయనా ధీరజ్ (నీరసంగా నడుస్తుంది)

ధీరజ్ : ఏమ్మా ఇంకా జ్వరం తగ్గలేదా?

తరుణి : జ్వరం లేదు తగ్గింది కానీ చాలా నీరసంగా ఉంది నాన్నా... నువ్వేంటి అలా డల్‌గా ఉన్నావ్?

ధీరజ్ : నాకు కూడా కొంచెం జ్వరం వచ్చినట్లుగా ఉంది.. పైగా స్కూల్లో చివాట్లు తిన్నాను నువ్వు ష్యూస్ తుడవలేదు సాక్సులు ఉతకలేదు అదే వేసుకుని వెళ్ళాను గా జ్వరం వచ్చినట్లుగా ఉంది.

తరుణి : అయ్యో నాన్నా నాకు బాగుంటే చేసేదాన్ని కదరా

ధీరజ్ : మా సార్ వచ్చి నా బ్యాగ్ చూసి ఈ బ్యాగ్ చూడు శుభ్రం చేసుకోలేదు ఏంటి అని తిట్టాడమ్మా

తరుణి : అయ్యో నాన్నా తిట్టారా?

ధీరజ్ : అవునమ్మా అమ్మ తలనొప్పిగా ఉంది నాకు కూడా నీరసంగా ఉంది (యాక్షన్ చేస్తాడు)

తరుణి : (తలపట్టుకుని) జ్వరమేమీ లేదే ... సరే కాళ్ళు చేతులు కడుక్కో తినేసి పడుకుందువుగానీ (లోపలికి వెళ్తుంది)

ధీరజ్ : టట్టడాయ్ (డాన్స్ స్టెప్పులేస్తాడు) అమ్మ నమ్మేసింది. ఇంక చదవక్కర్లేదు రాయనక్కరలేదు తిని పడుకోవడమే (స్టెప్పులేస్తూ బ్యాగు ఒక మూల, సాక్సులు, ష్యూస్ అడ్డదిడ్డంగా పడేసి లోపలికి వెళతాడు.)

(సాక్సమ్మ ఎంట్రీ - పడేసిన సాక్స్ పట్టుకుని పైనుంచి కింది వరకూ ఒకటే రకం డ్రెస్‌కి రకరకాల సాక్సులు క్లిప్పులతో పెట్టుకున్న అమ్మాయి ముందుకు రావాలి)

సాక్సమ్మ : ఛీఛీ చూసారా ఎలా విసిరాడో నన్నునేనండీ సాక్సమ్మని!ఎంత నిర్లక్ష్యం ఉండు చెప్తా.

ష్యూసమ్మ : నీ పని అన్న నయం ఓ పక్కన పడేశాడు నన్ను చూసావా ఏకంగా మూలకు తోసాడు (రెండు మూడు షూస్ కట్టుకుని రావాలి) ఏమాత్రం గాలాడకుండా రేపొద్దున్న వాటినే తిరిగి తొడుక్కుంటాడు

బ్యాగయ్య : అయ్యో అయ్యో అయ్యయ్యో నేనండి బ్యాగయ్యను (రెండు మూడు బ్యాగులు తగిలించుకుని రావాలి) నన్నేం చెప్పమంటారు నా గోడు చూసారా ఎలా విసిరేసాడో ఏనాడన్న నన్ను నెమ్మదిగా తీసుకొచ్చి భద్రంగా టేబుల్ మీద పెట్టాడా అలా ఎలా విసురుగా పడేసాడో చూశారుగా!

(లోపలి నుంచి వస్తాడు ధీరజ్ బట్టలు మార్చుకొని)

తరుణ : ఇదిగో ధీరజ్ ఇది తిను ఇంకొంచెం ఇంకొంచెం (అంటూ అటూ ఇటూ తిరుగుతూ తినిపిస్తూ ఉంటే దర్జాగా తింటూ ఉంటాడు ఆమె ప్లేట్ పట్టుకొని వెనక తిరుగుతుంది)

తరుణ : ఇక పడుకో (వాటర్ బాటిల్ ఇచ్చి లోపలికి వెళ్తుంది)

ధీరజ్ : (మంచం మీద పడుకుంటాడు. బ్యాగ్ రౌండ్ వాయిస్ టీచర్లు తిట్టిన మాటలు వినిపిస్తుంటాయి)

వాయిస్1 : ధీరజ్ అసలు ఎప్పుడన్నా సాక్స్ ఉతుక్కున్నావా?

వాయిస్ 2 : ఆ షూస్ చూడు ఎంత మురికిగా ఉన్నాయో తుడుచు కోవడం కూడా రాదా?

వాయిస్ 1 : ఆ బ్యాగసలు ఉతుక్కున్నావా అందులో పుస్తకాలు అలా అడ్డదిడ్డంగా ఎలా పెట్టుకున్నావు చూడు?

వాయిస్ 2 : అవును నీకు అసలు శుభ్రం చేసుకోవడం వచ్చా రాదా అన్ని మీ అమ్మే చేసి పెడుతుందా?

వాయిస్ 1 : చెప్పు ధీరజ్

వాయిస్ 2 : చెప్పు చెప్పవేం

ధీరజ్ : (టక్కున లేస్తాడు) అదీ అదీ ...

(సాక్సమ్మ, షూసమ్మ, బ్యాగయ్య ముగ్గురు చూస్తుంటారు) మీరెవరు?

సాక్సమ్మ : నేనా నువ్వు రోజు నన్ను తొడుక్కుని విసిరి పడేస్తావే ఆ సాక్సమ్మని!

ష్యూసమ్మ : నేను ఆ సాక్సమ్మ కంపుని భరిస్తూ నీ కాళ్లు తొడుక్కుంటే రక్షణగా నీతో నడిచే షూసమ్మని!

ధీరజ్ : ఏంటి నిజమా (ఆశ్చర్యంగా,ఆనందంగా) భలే ఉన్నారే (లేచి వస్తాడు స్టేజి మీద అటు ఇటు తిరుగుతూ బ్యాగయ్య దగ్గరకు వెళ్లి) మరి నువ్వు ఎవరు?

బ్యాగయ్య : నేనెవరో అలా ఎలా గుర్తుపట్టవు నీ భుజం ఎక్కి నువ్వు కుక్కిన చెత్త పుస్తకాలు మోసుకొచ్చే బ్యాగయ్యని

ధీరజ్ : ఓ నువ్వు బ్యాగయ్యవా? నువ్వు సాక్సమ్మవా? భలే భలే నాతో మాట్లాడుతున్నారా అమ్మకు చెప్పాలి అమ్మా అమ్మా?

సాక్సమ్మ : ఏయ్ ఆగు ఏంటి అమ్మ అని పిలుస్తావ్? మీ అమ్మతో ఏ సమస్య లేదు ఆమెతోనే నువ్వు అన్ని చేయించు కుంటున్నావుగా!

ధీరజ్ : అయినా పిలుస్తా అమ్మ ఓసారి ఇలా రా

తరుణి : ఏంట్రా కన్నా అయ్యో నాన్న ఏమైంది అలా గట్టిగా పిలిచావు? వీళ్ళంతా ఎవరూ?

ధీరజ్ : ఉండమ్మా నేను చెప్తాను ఇదిగో ఈవిడ సాక్సమ్మ ఈవిడేమో షూసమ్మ ... ఇదిగో ఇతను బ్యాగయ్య

తరుణి : హా

సాక్సమ్మ : అంత ఆశ్చర్యపోమాకమ్మా! నువ్వు చాకిరీ చేసి చేసి అసలు మీ అబ్బాయి చేత ఏ పని చేయించడం లేదు చూసావా నీకు జ్వరం రాగానే ఉతకని సాక్స్ వేసుకొని బడికి వచ్చాడు!

ష్యూసమ్మ : నన్ను కూడా తుడవకుండా అలాగే ఆ కంపు సాక్స్‌తో తొడుక్కొని మరీ వెళ్ళాడు. మరి బడిలో తిట్టరా?

బ్యాగయ్య : నన్ను మాత్రం దులపకుండా చిరిగిన పేపర్లు చాక్లెట్ కవర్లు పెన్సిల్ పొట్టు అన్నిటి మధ్య పుస్తకాలని కుక్కి మరీ పెట్టుకున్నాడు.

తరుణి : అయ్యో పాపం! నాకు జ్వరం వచ్చిందని సర్ద లేదండి!

బ్యాగయ్య : మీ పేరు అయ్యో పాపమా అండి ప్రతి మాటకి అయ్యో పాపం అంటారు? అన్నీ మీరే చేస్తే వాడికి ఎప్పుడు వస్తుంది?

తరుణి : అయ్యో పాపం వాడు చాలా చిన్నోడు కదండీ

సాక్సమ్మ : అంతేలెండి మీ కంటికి వాడెప్పుడూ చిన్నవాడేను

ష్యూసమ్మ : ఒక్కసారైనా ఎలా ఉతుక్కోవాలో చెప్పాలి కదా వాడికి తెలియాలి కదా ఇంతకీ సాక్స్ ఉతుక్కోకుండా వేసుకుంటే ఏమవుతుందో తెలుసా?

తరుణి : చెప్పండి మీరే

సాక్సమ్మ : మీకంటే ఈ అబ్బాయి ధీరజే తెలుసుకోవాలి ఉతకని సాక్స్ వేసుకుంటే దుర్వాసన, చర్మంపై దద్దుర్లు వస్తాయి వాటిలోని మురికి వల్ల బ్యాక్టీరియా ఫంగస్ పెరిగిపోతుంది

తరుణి : అమ్మో చూశావా ధీరజ్ ఉతకకుండా సాక్స్ వేసుకుంటే దద్దులొస్తాయంట వింటున్నావా?

ధీరజ్ : (తల ఊపుతాడు)

ష్యూసమ్మ : అలా తల ఊపడం కాదు ఆ సాక్సులతో పాటు షూస్ కూడా తుడిచి నీటుగా వేసుకోవాలి లేకపోతే ఏమవుతుందో తెలుసా?

ధీరజ్ : ఏమౌతుంది?

ష్యూసమ్మ : ఏమవుతుంది ఏమిటి? నీ బూట్లు అదే ష్యూస్ లోకి సూక్ష్మక్రిములు దూసుకెళ్తాయ్. మనం ఎక్కడికి వెళ్తే అవి మనతోనే మన చుట్టూ వస్తాయి చివరికి ఇంట్లోకి కూడా వస్తాయి వాటి వల్ల మనకి రోగాలు జబ్బులు వస్తాయి.

తరుణి : అమ్మో!

ష్యూసమ్మ : బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన ప్రతిసారి ఉతకగలిగే చెప్పులైతే ఉతికి లేదా తుడవ వలసినవైతే తుడిచి వాటిని బాగా ఆరబెట్టాలి ఆరకపోతే లోపల ఉన్న క్రిములు ఇంకా చేరిపోయి మనకు జబ్బులు వస్తాయి

బ్యాగయ్య : మరి నాగోడు వినరా! అలా తీసి పక్కన పడేయకుండా మొత్తం అందులో కుక్కినవన్నీ బయటకు తీసి దులిపి మురికి మరకలు పోగొట్టడానికి తగిన జాగ్రత్తలతో నీటిలో నానబెట్టి బ్రష్‌తో శుభ్రం చేసుకుని ఆరబెట్టుకోవాలి అలాంటి బ్యాగులో పుస్తకాలను పద్ధతిగా సర్దుకోవాలి అప్పుడు ఏ భయము ఉండదు ఎవరు తిట్టరు.

ధీరజ్ : భలే భలే మీరు చెబుతుంటే నిజంగానే మేము అసలు పట్టించుకోలేదని అనిపిస్తుంది.

తరుణి : మీరు చెబుతుంటే మీ విలువ పిల్లలకు తెలియాలంటే వారిచేత శుభ్రం చేయించాలని నాకు అర్థమైంది.

సాక్సమ్మ, ష్యూసమ్మ, బ్యాగయ్య: వచ్చిన పనైంది పదండ్రా

తరుణి : ఆగండి ఆగండి మీరు వచ్చి చాలా మంచి పని చేశారు మా ధీరజ్ చేత దగ్గరుండి మిమ్మల్ని ఎలా చూసుకోవాలి నేర్పిస్తాను

ధీరజ్ : (ముగ్గురికి షేక్ హ్యాండిస్తూ) నాకు అర్థమైంది నేను ఇకపై కాళ్లు శుభ్రంగా కడుక్కొని, తుడుచుకొని, ఉతికిన సాక్స్ వేసుకొని,శుభ్రం చేసిన షూస్ వేసుకుంటాను. బ్యాగులు మరకలు లేకుండా తుడిచి,పుస్తకాలను మంచిగా సర్దుకుని, భద్రంగా బ్యాగ్‌ని పెడతాను. థాంక్యూ ఫ్రెండ్స్ ఇకపై మీరు నాకు కొత్త ఫ్రెండ్స్ సరేనా!

సాక్సమ్మ, ష్యూసమ్మ, బ్యాగయ్య: అలాగే మరి మీ ఫ్రెండ్స్‌కి కూడా చెప్పి కొత్త మిత్రులను పరిచయం చేయాలి మరీ సరేనా!

– డా. సమ్మెట విజయ
m: 99898 20215

కథ

# అదృశ్య దేవత



తునికి భూపతి

తొమ్మిదవ తరగతి చదువుతున్న వెన్నెలకు పెండ్లి నిశ్చయం చేశారు. ఆ సంగతి తెలుసుకున్న తొమ్మిదవ తరగతి విద్యార్థినిలు బాధపడ్డారు. కానీ వెన్నెల వివాహానికి అడ్డు చెప్పడానికి ధైర్యం చాలలేదు. "పెద్దలే మౌనంగా వున్నప్పుడు మనమేమి చేయలేము" అంది ఒక విద్యార్థిని.

"వెన్నెలకు మన గ్రామ పెద్ద కొడుకుతో వివాహం జరిపిస్తున్నారు. ఆయనను ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదు." బాల్య వివాహాలు చాలా తప్పని అందరికీ తెలిసినా గ్రామంలో ఒక్కరూ వ్యతిరేకించలేదు. పెళ్లి పనులు ప్రారంభమైంది. వెన్నెలను ఇక బడికి వెళ్లద్దన్నారు. వెన్నెల స్నేహితురాళ్లను కలుసుకొనడానికి ఆ ఇంటి పెద్దలు అంగీకరించలేదు. ఇంటిముందు పెద్ద పందిరి వేశారు. మరుసటి రోజు ఉదయ ముహూర్తం. పెళ్లికి ముందురోజు ఏర్పాటు చేసిన విందు భోజనానికి గ్రామమంతా వచ్చారు. ఆ సమయంలో పోలీసు జీపు వచ్చి ఆగింది. "మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు మాకు ఫిర్యాదు వచ్చింది. ఈ పెండ్లి జరపకూడదు" అన్నాడు పోలీసు.

"వెన్నెల తండ్రిని, గ్రామ పెద్దను పోలీసు స్టేషనుకు తీసుకెళ్లాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్. గ్రామ పెద్ద గుర్రుమన్నాడు.

"ఈ గ్రామంలో నన్ను ఎదిరించి ఎవడురా ఫిర్యాదు చేసింది. వాడి అంతం చూస్తాను" అంటూ గ్రామప్రజల మధ్యలో అరిచాడు. గ్రామ ప్రజలు మౌనంగా వున్నారు.

"ఇన్‌స్పెక్టర్, ముందు ఫిర్యాదు ఎవరు చేశారో చెప్పండి" కోపంగా అన్నాడు గ్రామ పెద్ద.. "అయ్యా ఫిర్యాదు ఇక్కడి వారు చెయ్యలేదు. అమెరికా నివాసి అయిన సోఫియా అనే మహిళ మాకూ, కలెక్టరుకు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. చర్య తీసుకోకపోతే హోమ్ మినిస్టరుకు, ముఖ్యమంత్రికి పంపుతాను అంటూ హెచ్చరించింది" అంటూ ఇన్‌స్పెక్టర్ అనడంతో గ్రామపెద్ద ఖంగు తిన్నాడు.

'మా గ్రామంలో ఏ ఇంటివారు అమెరికాలో లేరు. ఆ సోఫియా ఎవరు' అనుకొంటూ జుట్టు పెరుక్కొన్నాడు గ్రామ పెద్ద. వెన్నెల తండ్రితో పాటు గ్రామ పెద్ద కలసి క్షమాపణ కోరుతూ ఈ బాల్యవివాహం చేయనని హామీ ఇచ్చాక వారిద్దరినీ అరెస్టు చేయలేదు. రెండు రోజుల తరువాత తరగతి గదిలో వెన్నెల అందరి వైపు చూస్తూ "నాకు జరుగనున్న వివాహాన్ని అడ్డుకొన్న ఆ అదృశ్య దేవతకు నేను నమస్కరిస్తున్నాను" అంటూ చేతులు జోడించింది. సెల్ ఫోన్ వీడియో గేమ్స్ ఆరోగ్యానికి హానికరం అయినా సెల్ ఫోన్ ఉపయోగించే పద్ధతిలో ఉపయోగిస్తే ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలుసుకొన్న రుత్వీ వీడియో గేమ్స్ ఆడే అలవాటు ఎప్పుడో మానుకొంది. కానీ తన స్నేహితురాలు వెన్నెలకు జరగబోతున్న బాల్య వివాహాన్ని ఎలా అడ్డుకుకోవాలా అని బాగా ఆలోచించింది. పట్టణంలో నివసించుచున్న తన స్నేహితురాలుకు ఫోనులో అన్ని వివరములు తెలిపింది రుత్వీ.

"రుత్వీ, మరోగంట తర్వాతా ఫోన్ చేసి చెబుతాను" అంటూ కట్ చేసింది. చెప్పిన విధంగానే ఒక గంట తరువాత ఫోన్ చేసింది. "మా సహజ అక్కయ్య అమెరికాలో ఉంది. రేణిగుంటలో వున్నపుడు మహిళలకు ఎటువంటి అన్యాయం జరిగినా ముందుండి అడ్డుకోనేది. న్యాయంకోసం చాల పోరాటాలలో పాల్గొంది. నేను ఆ అక్కకు ఫోన్ చేసి చెప్పాను. ఆ గ్రామ పెద్దకు మీ ఊరి ప్రజల మీద అనుమానం కలగకుండా వుండేలా పరిష్కరిస్తానని చెప్పింది. అమెరికాలోనున్న స్నేహితురాలి ద్వారా ఫిర్యాదు చేయిస్తానని చెప్పింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని ఆ గ్రామ పెద్ద ఏమీ చేయలేదు" అంది స్నేహితురాలు.


ఆ కాలంలో ఆకాశ రామన్న ఉత్తరంలా ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయించి బాల్య వివాహం జరగకుండా అడ్డుకొన్న ఆ అదృశ్య దేవత ఎవరో ఆగ్రామంలో రుత్వీకి మాత్రం తెలుసు.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025, 'పెద్దలు రాసిన పిల్లల కథలు-1'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

– ఓట్ర ప్రకాష్‌రావు
తిరుత్తణి
m: 97874 46026

# క్వాంటమ్ మెకానిక్స్ అర్థం కాదా? రిచ్చర్డ్ ఫెనీమన్

"క్వాంటమ్ మెకానిక్స్‌ను పూర్తిగా అర్థం చేసుకున్న వాళ్లు ఎవరూ లేరని నేను భావిస్తున్నాను." రిచ్చర్డ్ ఫెనీమన్ (Rechard Feyneman) (1918-1988) అనే భౌతిక శాస్త్రవేత్త 'ది క్యారెక్టర్ అఫ్ ఫిజికల్ లా' (The Character of Physical Law) అనే పుస్తకంలో జాగ్రత్త పడుతూ అన్నారు. ఈ సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త 'క్వాంటమ్ ఎలక్ట్రో డైనమిక్స్' సంబంధించి జూలియన్ స్వింగర్ (Julian Swinger)తో కలిసి 1965లో నోబెల్ బహుమతి అందుకున్నవారు. క్వాంటమ్ మెకానిక్స్ మాత్రమే కాకుండా న్యూక్లియర్ ఫిజిక్స్‌కు సంబంధించి, సైన్స్ సంబంధించి ఇలా ఎన్నో ప్రఖ్యాతమైన గ్రంథాలతో పాటు 'షూర్లీ యువార్ జోకింగ్ మిస్టర్ ఫెనీ మన్: అడ్వెంచర్స్ ఆఫ్ ఎ క్యూరియస్ క్యారెక్టర్' అనే పేరు గల ఆత్మకథను కూడా రాసుకున్నారు. ఈ పుస్తకానికి పెట్టిన పేరు గమనిస్తే ఆయన మంచి చమత్కారి అని కూడా బోధపడుతుంది. సరే, అన్నట్టు ఈ శాస్త్రవేత్త అలాంటి మాట ఎందుకు అన్నాడు... క్వాంటమ్ మెకానిక్స్ అర్థం చేసుకున్న వాళ్లు దాదాపు లేరేమో అని? ఆ మాటలు కనబడే పుస్తకం 1964లో అచ్చయిన వారి ప్రసంగాల మాలిక. అంటే ఆరు దశాబ్దాల క్రితమే ఈ మాట చెప్పేశారు. అప్పటికి ఈ ఇంటర్నెట్ వగైరాలు ఇంకా ప్రపంచాన్ని ముంచెత్తింది లేదు. ఇప్పుడు యావత్ ప్రపంచం క్వాంటమ్ అంటూ జపం చేస్తోంది.



ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879-1955) స్పెషల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ 1905లోనూ, జనరల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ 1915లోనూ ప్రతిపాదించారు. కానీ చాలా సంవత్సరాలు ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది అని వార్తలు చక్కర్లు కొట్టిన తర్వాత 1921లో ఫోటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించినందుకు ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి లభించింది. వీరు ప్రతిపాదించిన సాపేక్షతా సిద్ధాంతం కూడా పట్టుమని పది మందికి కూడా అర్థం కాలేదని అప్పట్లో ప్రచారం ఉండేది. దీనికి బహుమతి ఇస్తే రేపు విమర్శల పాలవుతామనే భయం కూడా నోబెల్ బహుమతుల కమిటీని పీడించేదట. చివరికి ఇవ్వకుండా వదిలివేయలేక, మధ్యే మార్గంగా ERmc2 (ఈ ఈక్వల్ టు ఎం సి స్క్వేర్) అనే ఈక్వేషన్‌ను తెలియజేసే 'ఫోటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్'కు ఇచ్చారు. ప్రస్తుతం చర్చించుకుంటున్న 'క్వాంటమ్ మెకానిక్స్' సంగతి ఇటువంటిది కాదు. మరి ఫెనీమన్ ఎందుకలా చెప్పారు?

శాస్త్రవేత్తలకు సామర్థ్యం తగ్గింది అని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కాదు. ఎందుకంటే క్రమంగా మరింత ప్రతిభావంతమైన శాస్త్రవేత్తలు వస్తూనే ఉన్నారు న్యూటన్, ఐన్‌స్టీన్ ఇలా..! ఈ మాట చెప్పిన 62 ఏళ్ల తర్వాత కూడా క్వాంటమ్ మెకానిక్స్ పెద్ద ఎత్తున ఉపయోగపడుతూ వస్తోంది. మరీ ముఖ్యంగా కంప్యూటర్ వంటి అధునాతన సాధనాలు వచ్చిన తర్వాత అది మరింతగా దోహదపడుతున్నది. కనుకనే ఇప్పుడు క్వాంటమ్ మెకానిక్స్ వందేళ్ళ చరిత్ర గురించి ఘనంగా చెప్పుకుంటున్నాం. అలాగే రాబోయే అద్భుతాల గురించి మరింత గొప్పగా కూడా టముకు వేస్తున్నాం. దాని ఎఫెక్ట్ కనబడుతోంది కానీ అది మన కంటికి కనబడేట్టు, మన స్ఫురణకు బోధపడేట్టు అర్థం కావడం లేదు. కాంతి తొలుత కణాలుగా ఉందని ప్రతిపాదించారు, తర్వాత కాదు అది తరంగాలుగానే ప్రవర్తిస్తున్నదని వివరించారు. తర్వాత కాలంలో బోధపడింది ఏంటంటే అది కణాలుగా ప్రవర్తిస్తుందని, అలాగే తరంగాలుగా కూడా ప్రవర్తిస్తుందని ఫలితాలు బోధపడ్డాయి. దీన్ని వివరించడానికి సోమ, బుధ, శుక్రవారాలు కణాలు గానూ; మంగళ, గురు, శనివారాలు తరంగాలుగాను కాంతి ప్రవర్తిస్తుందని ఒక ప్రెస్‌మీట్‌లో ఐన్‌స్టీన్ చమత్కారంగా వివరించారు. ఓ జర్నలిస్టు మరి ఆదివారం సంగతి ఏంటండీ అని అడిగినప్పుడు రెండింటిగానూ ప్రవర్తిస్తుందని ఐన్‌స్టీన్ తన జవాబుతో నోరు మూయించాడు. అంటే అది కణంగాను, తరంగాను లేదా మరో రూపంలోనూ ఏకకాలంలో లక్షణాలు చూపించవచ్చని అర్థం చేసుకోవాలి. రెండవది ఈ సూత్రాలు నియమాలు చెబుతున్నది స్థూల ప్రపంచం అంటే మాక్రో వరల్డ్ సంబంధించి కాదు, అది సూక్ష్మ ప్రపంచం మైక్రో వరల్డ్ సంబంధించింది మాత్రమే. అంటే పరమాణు గర్భంలో ఉన్న అతి సూక్ష్మకణాలు లేదా తరంగాలు... ఇంకా ఉంటే ఇతర రూపాలు ప్రవర్తించే లేక పొడచూపే శైలీ విన్యాసాలను వివరించే ప్రయత్నమే. సిద్ధాంతాలు అర్థం చేసుకోవడానికి తప్ప అంతకు మించి కాదు అని కూడా క్వాంటమ్ మెకానిక్స్ బోధిస్తోంది. ఇటువంటి సందర్భంలోనే రిచ్చర్డ్ ఫెనీమన్ చమత్కారంగా ఈ మాట అన్నాడని అర్థం చేసుకోవాలి.

– డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392

# మేడి చెట్టు







హేయ్ బాలలూ బాగున్నారా! అన్ని పరీక్షలు పూర్తి అయ్యాయి. ఇక నుండి వేసవి సెలవులే కదా! తగిన జాగ్రత్తలతో ఎంజాయ్ చేద్దాం. ఈ నెల బాలచెలిమి సంచికలో మనం "మేడి చెట్టు" గురించి తెలుసుకుందాం సరేనా! మేడి చెట్టు సాధారణంగా కనిపించే పెద్ద వృక్షం. దీన్ని ఆంగ్లంలో 'cluster fig tree' అంటారు. వాగులు, వంకలు తేమ ఉన్న ఏ ప్రదేశంలోనైనా పెరిగే మేడి చెట్టు పూర్వకాలంలో బావుల వద్ద రావి, మఱ్ఱి చెట్ల లాగే బాగా కనిపించేవి. రాను రాను మేడి చెట్టు కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. క్రీస్తు శకం నాలుగో శతాబ్దంలో రోమ్ దేశంలో మేడి చెట్లు సాగు చేసినట్లు చరిత్ర చెబుతుంది. 13వ శతాబ్దంలో ఇంగ్లాండ్ అంతట సాగు చేసేవారు. ఆ తర్వాత మన భారతదేశం వంటి అనేక దేశాల్లో ఈ చెట్ల విస్తీర్ణం పెరిగింది. దీనిలో 200 రకాలకు పైగా ఉన్నాయి. మేడి చెట్టు యొక్క శాస్త్రీయ నామం ఫైకస్ (ficus).

"మేడిపండు చూడ మేలిమై యుండు / పొట్ట విప్పి చూడ పురుగులుండు" అని మనం చిన్నప్పటి నుండి వేమన పద్యం చదువుకున్నాం కదా! ఆ చెట్టుకు ఎంతటి ప్రాధాన్యత ఉందో ఇంకా తెలుసుకుందామా! పూర్వం హిరణ్యకశిపుడు అనే రాక్షసుడు ఉండేవాడు. తన కుమారుడు ప్రహ్లాదుడు తన శత్రువైన హరికి పరమ భక్తుడుగా ఉండేవాడు. ఇది సహించని తండ్రి హిరణ్యకశపుడు "నీ హరి ఎక్కడున్నాడని, ఈ స్తంభంలో ఉన్నాడా? చూపించు" అని ప్రహ్లాదుని హింసించినాడు. కుమారుడు ప్రహ్లాదుడు భక్తితో పూజించగా స్తంభం పగులకొట్టుకుని నరసింహావతారంలో శ్రీహరి ప్రత్యక్షమై తన బలమైన గోళ్ళతో హిరణ్యకశపుడిని చీల్చి చంపుతాడు. అలా చంపినప్పుడు ఆ దుర్మార్గుడైన రాక్షసుడి రక్తం విష్ణువు చేతుల కంటుకుని దురదలు, మంటలు పుట్టాయట. అప్పుడు లక్ష్మీదేవి మేడి చెట్టు ఆకులు, పండ్లతోనూ శ్రీహరి చేతులు తుడిచి ఉపశమనం కలిగించిందట. అందుకు సంతోషించిన విష్ణువు "నిన్ను భక్తితో సేవించిన వారికి బాధలు తొలగి, పాపాలు నశించి, అభీష్టాలు నెరవేరుగాక" అని గొప్పగా వరమిచ్చాడంట. అప్పటినుండి ఈ మేడి చెట్టుకు ఎంతో ప్రాధాన్యత కలిగినట్లు చరిత్ర చెబుతుంది. ఇట్లా హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదిగా, ఆరోగ్య ప్రదాయినిగా మేడి చెట్టు పరిగించబడుతుంది. దత్తాత్రేయ స్వరూపంగా పూజలందుకునే ఈ చెట్టు చర్మ, జీర్ణ, రక్త స్రావ సంబంధిత సమస్యలను తగ్గించే గొప్ప ఔషధ గుణాలు కలిగి ఉంది. దీని బెరడు, ఆకులు, పండ్లు వివిధ ఆయుర్వేద చికిత్సలలో ఉపయోగిస్తారు. మేడిపండ్లను అత్తి పండ్లు అని, మేడి చెట్టును అత్తి చెట్టు మరియు ఔదాంబర్ వృక్షం అని కూడా పిలుస్తారు. విటమిన్లు సి , కె , ఐరన్, పొటాషియం యాంటీ ఆక్సిడెంట్లకు మంచి మూలం. మేడి చెట్టు యొక్క ఆకులు ఆకుపచ్చగా బొప్పాయి ఆకుల ఆకారంలో నిగనిగలాడుతూ ఉంటాయి. ఈ చెట్టుకు నేరుగా పువ్వులు పూయవు. ఆకుల, కాడల వద్ద నేరుగా మేడి కాయలు గుత్తులు గుత్తులుగా కాస్తాయి. ఇవి అంజూర పండ్ల మాదిరిగా పసుపు, ఎరుపు రంగులో ఉండి గుడ్డు ఆకారంలో కాయలు కాసి పండుతాయి. ఈ పండ్లను పట్టుకున్నప్పుడు మెత్తగా ఉండి ఒక్కో సారి లోపల పురుగులు కూడా కనిపిస్తాయి. జాగ్రత్తగా చూసి తినాలి. ఇవి తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ పండు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ క్రియ సాఫీగా జరుగుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. రక్తస్రావం తగ్గించడమే కాకుండా చర్మవ్యాధులు, మధుమేహం నియంత్రణకు, లివర్ ఆరోగ్యానికి కూడా ఈ పండ్లు సహాయపడతాయి. మామూలుగా ఎండాకాలంలోనే ఈ మేడి పండ్లు మనకు లభిస్తాయి. ఇప్పుడు తెలుసుకున్నాం కదా బాలలూ! మేడి చెట్టు గొప్పతనం ఏమిటో! మనం కూడా పర్యావరణపరంగా, భావితరాల కోసం మేడి చెట్లను వీలైనంత మేరకు పెంచుదాం. మేడి పండ్లను తిని ఆరోగ్యంగా ఉందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



సంకల్ప బలం
విన్న కథకు అక్షరీకరణ :
జుగాష్విలి
బొమ్మలు:
గోపి: తాతయ్యా! ఈ రోజు మా టీచర్ ఒక మంచి కథ చెప్పారు. నువ్వూ వింటావా?
తాతయ్య: చెప్పు! చెప్పు! వింటాను.
గోపి: రాము, వేణు మంచి స్నేహితులు. రాము వయస్సు 10 సంవత్సరాలు. బలంగా ఉంటాడు. వేణు వయస్సు 7 సంవత్సరాలు. ఒక రోజు వాళ్లిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఊరి బయట పొలాల వైపు వెళ్లారు. మంచి ఎండా కాలం. రాముకి దాహం వేసింది. దూరంగా చేద బావి కనిపించింది.
తాతయ్య: ఎండా కాలం చిన్న పిల్లలు ఊరికి దూరంగా వెళ్ళొచ్చా... చెప్పు.
గోపి: వెళ్లకూడదులే. కాని వెళ్లారు.
తాతయ్య: ఆఁ! అప్పుడేం చేసారు?
గోపి: ఇద్దరూ బావి దగ్గరకు వెళ్లారు. బావికి చేద వుంది కాని బొక్కెన లేదు. రాము మునివ్రేళ్ల మీద తొంగి చూస్తూ బావిలో పడిపోయాడు. వేణూకి భయమేసింది. చుట్టుపక్కల మనుషులెవరూ కనిపించలేదు. రాము లోపల్నించి 'ఒరే వేణూ ఆ తాడు బావిలోకి వదలరా అని పెద్దగా అన్నాడు.
తాతయ్య: చిన్నోడైనా మంచి ఆలోచనే.
గోపి: అవును. వేణు తాడు లోపలికి వేసాడు. రాము తాడు పట్టుకొని పైకి లాగురా వేణూ అని అరుస్తున్నాడు. వేణు ఆ బరువును లాగలేకపోతున్నాడు.
తాతయ్య: అయ్యో చిన్న పిల్లోడు కదా...


గోపి: లోపల్నించి రాము ధైర్యం చెబుతూ పర్లేదు వేణూ జాగ్రత్త. నువ్వు లాగగలవు... లాగు అని గైడ్ చేస్తున్నాడు. వేణు కాళ్ళు నేలకు అదిమి పెట్టి బలంగా లాగుతూ చివరికి రాముని రక్షించాడు.
తాతయ్య: గడుసు పిండమే పిల్లోడు.
గోపి: రాము తడిసిపోయాడు. అమ్మానాన్నలు ఏమంటారో అని భయపడుతూ ఇంటికి వచ్చారు. జరిగినదంతా చెప్పారు. ఎవరూ నమ్మలేదు. చిన్న పిల్లవాడు పెద్దవాడిని ఎలా కాపాడగలడు అని ఆశ్చర్య పోతున్నారు.
తాతయ్య: ఎవరైనా ఎలా నమ్ముతారు మరి..?
గోపి: అప్పుడే అటుగా వెళ్తున్న రాము వాళ్ల టీచర్ విషయం తెలుసుకొని వాళ్ళు చెప్తుంది నిజమే అన్నాడు.
అదెలా...
మాస్టారు యిలా అన్నారు - రాము వయస్సులో, బరువులో ఎక్కువే. వేణు చిన్నవాడు. అంత బరువు లాగడం కష్టమే. వేణూకి ఆ క్షణం అవేమీ గుర్తు లేవు. రాము ప్రమాదంలో వున్నాడు. రక్షించడం ఎలా అనే ఒకే ఒక ఆలోచన. వయస్సుతో, బలంతో పని లేక పోయింది. అన్నిటికన్నా ముఖ్యం 'నువ్వు చిన్న పిల్లాడివి. బలం లేదు. ఈ పని నువ్వు చెయ్యలేవు' అని వెనక్కి లాగేవాళ్ళు అక్కడ ఎవరూ లేకపోవడం.
అందరూ: అర్థమైంది మాస్టారూ.
తాతయ్య: ఆలోచనలో, సంకల్పంలో వున్న బలం గురించి మీ టీచర్ మంచి కథ చెప్పారు. ప్రతి స్కూల్లో మోటివేషన్ క్లాసులు ఉండాలిరా అబ్బాయ్!
గోపి: అవును తాతయ్యా! మా స్కూల్లో వారానికో పీరియడ్ ఉంది.

స్పోర్ట్స్

# బెంగాల్ నుంచి ప్రపంచ వేదిక వరకు అరోణ్యక్ ప్రయాణం

అరోణ్యక్ ఘోష్ (జననం 2003) బెంగాల్‌కు చెందిన ప్రతిభావంతమైన యువ చెస్ క్రీడాకారుడు. చిన్నప్పటి నుంచే చెస్ ఆటపై ఆసక్తి పెంచుకున్న ఆయన, సాధారణ కుటుంబంలో పెరిగినా తన అసాధారణ మేధస్సుతో ప్రత్యేక గుర్తింపు పొందాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం ఆయన విజయయాత్రకు బలమైన పునాది అయ్యాయి. అంతర్జాతీయ మాస్టర్ బిరుదు సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.



2023లో జరిగిన భారత చెస్ చాంపియన్‌షిప్‌లో అరోణ్యక్ మూడవ స్థానాన్ని సాధించాడు. అదే సంవత్సరం సాంట్స్ అంతర్జాతీయ ఓపెన్ పోటీలో నాలుగో స్థానంలో నిలిచి తన తొలి గ్రాండ్ మాస్టర్ నార్మ్‌ను అందుకున్నాడు. ఇది ఆయన కెరీర్‌లో కీలక ఘట్టంగా నిలిచింది. 2024లో అన్నెమాస్ మాస్టర్స్ పోటీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆయన, టైబ్రేక్ ద్వారా విజేతగా నిలిచి రెండో గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను సాధించాడు. ఈ విజయంతో ఆయన అంతర్జాతీయ వేదికపై మరింత గుర్తింపు పొందాడు.

2025లో ప్రపంచ కప్ చెస్ పోటీలకు అర్హత సాధించిన అరోణ్యక్, తొలి రౌండ్‌లో ప్రత్యర్థిని ఓడించి సంచలనం సృష్టించాడు. రెండో రౌండ్‌లో పరాజయం పొందినప్పటికీ, ఆయన పోరాట స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

బ్యాంకాక్ చెస్ క్లబ్ ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొన్న 22 ఏళ్ల కోల్‌కతా ఆటగాడు, జీఎం హోదా కోసం అవసరమైన మూడవ నార్మ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. మొత్తం తొమ్మిది రౌండ్లు ముగిసే సరికి అరోణ్యక్ ఏడు పాయింట్లు సాధించి, ఇతర ఆటగాళ్లతో కలిసి అగ్రస్థానాన్ని పంచుకోవడం విశేషం. ఈ పోటీలో ఆయన ప్రదర్శించిన స్థిరత్వం, వ్యూహాత్మక ఆలోచన, ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యం ఆయన విజయానికి మూలస్తంభాలుగా నిలిచాయి.

భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్ఫూర్తితో అరోణ్యక్ తనదైన మార్గాన్ని నిర్మించుకున్నాడు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆశిస్తున్నారు.

– బాలచెలిమి డెస్క్

## బాలచెలిమి సంపాదకులు ఇంజనీర్ వేదకుమార్ మణికొండకు INTACH జాతీయ కార్యవర్గంలో గౌరవ స్థానం

బాలచెలిమి సంపాదకులు ఇంజనీర్ వేదకుమార్ మణికొండ గారు INTACH జాతీయ కార్యవర్గానికి ఎన్నిక కావడం గర్వకారణం. ఇటీవల 2026–2029 కాలానికి INTACH గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా ఎంపికైన ఆయన, ఇప్పుడు జాతీయ కార్యవర్గంలో కూడా స్థానం పొందారు. ఈ విషయాన్ని న్యూ ఢిల్లీలోని INTACH ప్రధాన కార్యాలయంలో చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ గారు, 34వ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో తేదీ 17.4.2026 నాడు ప్రకటించారు.

ఈ గౌరవం ఆయన నాయకత్వం, అనుభవం, మరియు వారసత్వ పరిరక్షణపై ఉన్న అంకితభావానికి గుర్తింపుగా నిలిచింది. INTACH జాతీయ కార్యవర్గానికి దక్షిణ భారతదేశం నుండి ఎన్నికైన ఏకైక వ్యక్తిగా వేదకుమార్ గారు నిలిచారు. ఆయన సాధించిన ఈ ఉన్నత స్థానం దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, విద్యా రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రానికే కాకుండా మొత్తం దక్షిణ భారతదేశానికి ఇది గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చింది.

జాతీయ కార్యవర్గంలో ఆయన భాగస్వామ్యం ద్వారా INTACH కార్యక్రమాలు మరింత విస్తరించి, దేశవ్యాప్తంగా వారసత్వ పరిరక్షణకు మరింత బలం చేకూరుతుంది.



ఎడమ నుంచి కుడికి: శ్రీ అశోక్ సింగ్ ఠాకూర్, చైర్మన్, INTACH న్యూ ఢిల్లీ & శ్రీ Er. వేదకుమార్ మణికొండ, సంపాదకులు, బాలచెలిమి




# నిజాయితీకి బహుమతి

నరసింహపురంలోని రామయ్య చాలా పేదవాడు. అతడు ఒకరోజు కూలి పనిచేసి అలసిపోయి ఒక చెట్టు కింద నిద్రిస్తున్నాడు. అప్పుడే ఒక కోతి బంగారు నగల మూటను తెచ్చి అతని ప్రక్కన పడవేసి వెళ్ళిపోయింది. రామయ్య లేచి చూసేసరికి తన ప్రక్కన నగలమూట కనిపించింది. “అయ్యో! ఇది ఎవరు పోగొట్టుకున్నారో! ఏమో!” అని దానిని తీసుకొని దగ్గరగా ఉన్న పొరుగు గ్రామం చేమంతిపురం వైపు తన నడకను సాగించాడు.

ఇలా ఉండగా ఆ రాత్రి పొరుగు గ్రామమైన చేమంతి పురంలోని కనకయ్య ఇంట్లో దొంగలు పడి నగలు పోయాయని ఊరంతా ఆ సమయంలో చెప్పుకుంటున్నారు. అప్పుడే అక్కడికి చేరిన రామయ్య ఆ కనకయ్య ఇల్లును వెతుక్కుంటూ బయలుదేరాడు. ఇంతలో కనకయ్య ఇంటికి చేరిన మరొక వృద్ధుడు మీ నగలను దొంగలు ఎత్తుకొని పోలేదని, ఒక కోతి ఏదో నగల మూటను తీసుకొని పోతుంటే తాను చూశానని వారి ఇంటిలో చెప్పాడు. అప్పుడు దొంగలు పడ్డారని భావించిన కనకయ్యకు ఆ నగల మూటను దొంగలు ఎత్తుకొని పోయారో! లేక కోతి తీసుకొని వెళ్ళిందో! అర్థం కాలేదు. ఈలోగా రామయ్య అక్కడకు చేరుకొని “అయ్యా! ఈ నగలమూట మీదేనా! చూడండి” అని ఇచ్చాడు. అది కనకయ్య పోగొట్టుకున్న నగల మూటనే! దానిని తీసుకొని కనకయ్య “ఇది నా నగల మూటనే” అని చెప్పి ఆ నగలన్నింటినీ ఒక్కొక్కటి తీసి పరిశీలించాడు. అందులో మిక్కిలి ఖరీదైన చంద్రహారం లేదు.

వెంటనే అతడు ఆ నగల మూటను తెచ్చిన రామయ్యతో “ఇందులోని చంద్రహారం ఏమైంది? నీవు ఉంచుకున్నావా ఏమిటి? నీవే ఆ దొంగలలో ఒకడివి” అని అన్నాడు. అప్పుడు రామయ్య బాధపడి “అయ్యో! నేను అలాంటి వాడిని కాదండి. నేను ఒక చెట్టు క్రింద నిద్రపోయి ఉన్నాను. నాకు మెలకువ వచ్చేసరికి ఈ నగల మూట నా ప్రక్కనుంది. అది ఎవరు తెచ్చి వేశారో నాకు తెలియదు” అని అన్నాడు. కానీ కనకయ్య రామయ్య మాటలను నమ్మలేదు. రామయ్యనే ఆ నగలమూటను ఎత్తుకొని వెళ్లాడని, అందులోని చంద్రహారం తీసాడని కనకయ్య అతడిని గ్రామ పెద్ద వద్దకు తీసుకొని వెళ్ళాడు. “అయ్యో దేవుడా! మంచికి పోతే చెడు ఎదురయింది” అని అనుకున్నాడు రామయ్య.

ఇంతలో మారయ్య అను వ్యక్తి గ్రామాధికారి వద్దకు వచ్చి “అయ్యా! కొందరు దొంగలు నగల మూటను దోచుకొని పోతుంటే నేను అడ్డు తగిలినాను. నేను ఆ దొంగల చేతిలోని నగల మూటను నా ప్రాణాలకు తెగించి లాక్కొనబోతే వారు

నన్ను గాయపరచి పారిపోయారు. ఆ పెనుగులాటలో ఈ చంద్రహారం క్రింద పడి తర్వాత నాకు దొరికింది” అని తనకు దొరికిన చంద్రహారాన్ని ఆయనకు అప్పగించాడు.


గ్రామాధికారికి అప్పుడు అసలు విషయం అర్థమైంది. తర్వాత గ్రామాధికారి కనకయ్యతో “ఓ కనకయ్యా! ముందు మీ ఇంట్లో దొంగలు పడి ఈ నగల మూటను దోచుకుని పోయేటప్పుడు ఈ మారయ్య మొదట ఆ దొంగలను అడ్డుకున్నాడు. ఆ పెనుగులాటలో ఈ చంద్రహారం క్రిందపడి ఈ మారయ్యకు దొరికింది. తర్వాత దొంగలు ఆ నగల మూటతో పారిపోగా ఒక కోతి వారిని గాయపరిచింది. తరువాత ఆ నగల మూటను తినే పదార్థం అని అనుకున్న కోతి ఎత్తుకొని పోయి నిద్రపోతున్న ఈ రామయ్య ప్రక్కన దానిని పడవేసింది. అదీ సంగతి! చూశావా! ఇప్పుడు ఈ చిక్కుముడి వీడింది. మీ ఇంట్లో దొంగలు పడి ఎత్తుకొని పోతే అనవసరంగా నీవు ఈ రామయ్యను అనుమానించావు. నీ నగలమూట కొరకు ధైర్యంగా ఈ మారయ్య ఆ దొంగలతో పోరాడాడు. వీరి నిజాయితీకి ఏదైనా బహుమానం ఇవ్వు!” అని అన్నాడు. గ్రామాధికారి రామయ్య, మారయ్యల నిజాయితీని అభినందించాడు. అప్పుడు కనకయ్యకు కూడా విషయం అర్థమై తాను రామయ్యపై దొంగతనం మోపినందుకు అతనిని క్షమించమని కోరాడు. తర్వాత అతనికి బహుమానాన్ని ఇవ్వబోతే ఆ రామయ్య నిరాకరించాడు. “అయ్యా! మీకు వ్యాపారం ఉన్నదనీ, మీరు చాలా ధనవంతులని నాకు ఇక్కడికి వచ్చిన తర్వాత తెలిసింది. మీ వద్ద నాకు ఏదైనా పని ఉంటే ఇప్పించండి” అని రామయ్య కనకయ్యను కోరాడు.

అప్పుడు కనకయ్య “నీలాంటి నిజాయితీపరుడు మా మిల్లులోనే పని చేయాలి. రేపటి నుండి నీవు పనిలోకి రా!” అని రామయ్యతో అన్నాడు. అతనికి కనకయ్య పని ఇవ్వడం చూసి గ్రామాధికారి ఎంతో సంతోషించాడు. కనకయ్య మారయ్యకు కూడా బహుమానాన్ని ఇవ్వబోతుంటే మారయ్య కూడా ఆ బహుమతి వద్దని తనకు కూడా ఏదైనా పని ఇప్పించమని కోరాడు. అప్పుడు కనకయ్య అతనికి కూడా తన మిల్లులోనే పని ఇచ్చాడు. తర్వాత కనకయ్య రామయ్యకు, మారయ్యకు బహుమానంగా కొంత డబ్బును కూడా ఇవ్వబోయాడు. రామయ్య, మారయ్యలు తమకు డబ్బును వద్దని నిరాకరించారు. కానీ కనకయ్య తన సంతోషం కొరకు తీసుకొమ్మని వారిని బలవంతంగా ఇది మీ నిజాయితీకి బహుమానం అని ఒప్పించాడు. కనకయ్య చేసిన పనికి ఆ గ్రామాధికారి ఎంతో సంతోషించాడు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
ధర్మపురి
m: 9908554535

శతకం

## వేమన పద్యాలు




**పాల నీడి గింట గ్రోలుచునుండెనా**
**మనుజులెల్ల గూడి మద్యమండ్రు**
**నిలువదగని చోట నిలువ**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : కల్లు పాకలో కూర్చుండి పాలు త్రాగినను, కల్లు త్రాగుచున్నాడని అందురు. ఉండకూడని ప్రదేశంలో ఉన్నచో చెడ్డ పేరు వచ్చును.

**తామసించి చేయ తగదెట్టి కార్యంబు**
**వేగిరింపనదియు విషమెయగును**
**పచ్చికాయ దెచ్చి ఒడవేయ ఫలమౌనె?**
**విశ్వదాభిరామ వినురవేమ!**


తాత్పర్యం : ఓ వేమా! ఏ పనియైనను, గర్వముతో చేయరాదు. తొందర పడినచో యే కార్యమైనను చెడిపోవును. పచ్చికాయ దెచ్చి నేలపై చితుక గొట్టినను అది పండు కాదు.



కథ

# మెరిసే సీతాకోక చిలుక

ఆంద్రి ప్లతోనొవ్



అనగనగా ఒక ఖండంలో నల్లసముద్రం ఉండేది. దాని ప్రక్కన పర్వతాలు ఉండేవి. అక్కడ అనీసియా అనే ముసలవ్వ జీవిస్తూ ఉండేది. ఆమె ఒంటరిగా ఉండేది. ఇంటి చుట్టు రోజా పూలతోటను పెంచుకొనేది.

ఉలియన్ అనే పొరుగింటి వ్యక్తి, ప్రతి సంవత్సరం ముసలవ్వ ఇంటికి వచ్చేవాడు. తేనె, ఇంటి సరుకులు మొదలయినవి తెచ్చేవాడు. ముసలవ్వ కళ్ళజోడు బాగుచేసేవాడు. కొన్నాళ్ళకు ఉలియన్ కూడా ముసలివాడై చనిపోయాడు.

తన వయసెంతో కూడా మర్చిపోయింది ముసలవ్వ. ఎలాగంటే, చిన్నప్పుడు ఇల్లు వదిలివెళ్లిన కొడుకు 'తెమోషా' కోసం ఎదురుచూస్తూ జీవితమంతా నిస్సారంగా గడిపేసింది. ముసలితనం వచ్చేసినా కొడుకు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తూనే ఉంది.

అసలేం జరిగిందంటే..

తెమోషాకి సీతాకోకచిలుకలంటే బాగా ఇష్టం. ఓరోజు సీతాకోకచిలుకను పట్టుకొని తల్లి వద్దకు తెచ్చాడు.

"అమ్మా! ఇది ఎగరదా?" అని అడిగాడు.

"బాబూ! నువ్వు దాని రెక్కలని నలిపావు. పాపం! అది ఇక ఎగరలేదు. అలా సీతాకోకచిలుకలను పట్టుకోవద్దు. వాటిని స్వేచ్ఛగా ఎగరనివ్వు" అని మందలించింది.

కానీ, తెమోషా వినేవాడు కాదు.

వాళ్ళ ఇంటి చుట్టుపక్కల చిన్న కొండలు, పెద్ద కొండలు వరుసగా ఉండేవి. ఇంటి నుండి పెద్ద కొండల వరకు ఒంకరటింకరైన కాలిబాట ఉంది. పెద్ద కొండల తర్వాత కాలిబాట లేదు, ఎందుకంటే పెద్ద కొండలు పెరిగి పెరిగి ఆకాశంలో కలిసేవి.

ఒకరోజు తెమోషా, సీతాకోకచిలుకల కోసం కొండలలోకి వెళ్ళాడు.

తల్లి ఇలా పిలిచింది, "బాబూ! నీవు సీతాకోకచిలుకల ఆటలోపడి, ఈ అమ్మను మర్చిపోయావు. త్వరగా ఇంటికి రా!".

తల్లి మాటలు వినగానే "వస్తున్నానమ్మా!" అంటూ తెమోషా ఇంటికి చేరేవాడు. కొన్ని నెలల తరువాత తెమోషా రోజూలానే సీతాకోకచిలుకల కోసం కొండలలోకి వెళ్ళాడు.

చీకటి పడింది. తెమోషా ఇంటికి బయలుదేరాడు. ఇంతలో బంగారు రంగులో మెరిసిపోయే పెద్ద సీతాకోక చిలుక కనిపించింది.

అది గద్దంత పెద్దది.

దానిని పట్టుకోవాలని చూశాడు తెమోషా. కానీ అది దొరకలేదు. దాన్ని వెంబడిస్తూ, చిన్న కొండల్ని, పెద్ద కొండల్ని దాటేశాడు. చివరకి ఆకాశం కనిపించింది.

ఆకాశంలో అందమైన నక్షత్రాలు కనిపించాయి.

తెమోషా నక్షత్రాన్ని పట్టుకోవాలని గాలిలో ఎగిరాడు. పొద్దున లేచేసరికి తెమోషా ఓ లోయలో పడ్డాడు. చుట్టూ ఎత్తయిన కొండలు. ఇంటికి వెళ్ళే దారే లేదు. ఎంతో ఏడ్చాడు. చివరికి అక్కడే బతకడం మొదలుపెట్టాడు. రోజూ కొండని పగలకొట్టేవాడు. అలా యాభై యేళ్ళపాటు కొండను పగలకొడుతూనే ఉన్నాడు. చివరికి సొరంగమార్గం నిర్మించాడు. అప్పటికే అతను ముసలివాడయ్యాడు.

చివరకి ఓ రోజు సొరంగం చివర తల్లి గొంతు వినిపించింది. "అమ్మా!" అని అరిచాడు తెమోషా. సొరంగమార్గం చివరి బండని తొలగించి తల్లిని కలుసుకున్నాడు. తల్లి మొదట తెమోషాను గుర్తించలేదు. తరువాత ఆనంద బాష్పాలతో కన్నీరు కార్చింది. కొడుకుని కౌగిలించుకుంది. కొడుకు చేతుల్లో హాయిగా కన్ను మూసింది.



స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**

m : 81792 73971

ఇంగ్లిష్ : ది గౌడి బటర్‌ఫ్లై

రచయిత : ఆంద్రి ప్లటోనొవ్

ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డియన్


**కవిత**

నా చేతిలో కలం
కేవలం వస్తువు కాదు
శబ్దం లేని నా మాట
నిశ్శబ్దంగా నడిచే సైనికుడు

యుద్ధం చేయని నా ఆయుధం
మనసుపరంలో దాగి ఉన్న భావాన్ని
గుండె లోతుల్లోని గాఢమైన కోపాన్ని
అక్షరాల సైన్యంగా నడిపిస్తుంది


ఒక్క సిరా చుక్కతో
ఒక దేశ చరిత్ర నే మార్చగలిగే శక్తి దీనిది
కత్తి గాయం మానవచ్చు కానీ
కలం రాసిన మాట
ఎప్పటికీ నిలిచి ఉంటుంది
కాగితంపై సత్యానికి తొలి సంతకం


**– ఆర్. జాహ్నవి**

7వ తరగతి, ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల
సూర్యాపేట,
గైడ్ ఉపాధ్యాయుడు: కే విజయ్ కుమార్
తెలుగు పండిట్

కథ

# మంచికి దండం చెడుకు గండం




ఒక చిన్న ఊరిలో ఒక అందమైన తోట ఉంటుంది. ఆ తోటలో రెండే రెండు రకాల మొక్కలు తోటనిండా పక్కపక్కనే పెరుగుతుంటాయి. ఒకటి గులాబీ మొక్క, రెండోది తులసి మొక్క.

గులాబీకి గర్వం. గులాబీ మొక్క తన రంగురంగుల పూలను చూసుకుని చాలా గర్వపడుతుంది. పక్కనే ఉన్న తులసిని చూసి, "నీకు పువ్వులు లేవు, అందం లేదు. నేనెంత అందంగా ఉన్నానో చూడు!" అని ఎగతాళి చేస్తుంది. అంతేకాదు, ఎవరైనా తనను తాకబోతే తన ముళ్లతో గుచ్చి కోపం చూపిస్తుంది.

తులసిది శాంతం. తులసి మొక్క ఏమీ అనకుండా ఎప్పుడూ నవ్వుతూ, తన మంచి సువాసనను అందరికీ పంచుతూ ఉంటుంది.

ఒకరోజు ఆ తోటలోకి ఒక చిన్న పాప వస్తుంది. గులాబీ పువ్వును కోయాలని చేయి పెడితే, అది ముల్లుతో గుచ్చుతుంది. పాప ఏడుస్తూ వెళ్ళి వాళ్ళ నాన్నకి చెపుతుంది.

వాళ్ళ నాన్న పాపని ఊరుకో పెట్టడానికి, వాళ్ళ ఇంట్లో ఉన్న కత్తెరని చేత్తో పట్టుకుని పాపని ఎత్తుకొని తీసుకెళ్లి ఏదీ చూపెట్టు, నిన్ను ముల్లుతో గుచ్చిన దాన్ని ఈ కత్తెరతో కత్తిరించి పడేస్తా! అని కోపంగా వెళ్ళి, ఆ కొమ్మని కత్తిరించి, ఆ పాపకి చూపెట్టి చూశావా దీనికి బుద్ధి చెప్పాను! అని దాన్ని పెరట్లో చెత్తలో పడేసి పాపని లోపలికి తీసుకెళ్లి ఇంకెప్పుడూ దాని దగ్గరకు వెళ్ళకు! అది చెడ్డది అని చెపుతాడు. అదే సమయంలో ఆ పాపకు జలుబు చేసి బాధపడుతుంటే, వాళ్ల అమ్మ వచ్చి తులసి ఆకులను కోసి, ఆ ఆకులు ఆ పాప చేత తినిపిస్తుంది.


అలా రెండు రోజులు తినిపించగానే ఆ పాపకి జలుబు నయం అవుతుంది. పైగా ప్రతిరోజూ ఆ పాప అమ్మ పూజ చేసుకుని పూజ అయ్యాక చెంబులో నీళ్ళు తెచ్చి ఆ తులసి మొక్కలో పోసి దండం పెట్టుకోవడం, వాళ్ళ నాన్న సంధ్యావందనం చేసుకోవడం అయ్యాక చెంబులో నీళ్ళు తెచ్చి తులసి చెట్టు మొదట్లో పోసి దండం పెట్టు కోవడం చూసి ఒక రోజు పాప అమ్మని అడుగుతుంది ఎందుకమ్మా! రోజూ తులసికి నీళ్లు పోసి దండం పెడతావు? అని.

అమ్మ చెపుతుందీ. చూడమ్మా! తులసి అంటే అది నేను నీకు ఎలా అమ్మనో! అది కూడా మనందరికీ అమ్మ లాంటిదే! మొన్న నీకు జలుబు చేస్తే అదే కదా! నీకు తగ్గించిందీ! అని చెపితే, పాప అవును అది చాలా మంచిది! అది నన్ను గుచ్చదు!

పాప తులసి మొక్కను ప్రేమగా నిమురుతుంది. అది చూసిన గులాబీకి అర్థమవుతుంది – "అందం కంటే ఉపయోగపడే గుణమే గొప్పది" అని. తన ముళ్లతో ఇతరులను ఏడిపించడం కంటే, తులసిలా అందరికీ మేలు చేయడం మిన్న అని తెలుసుకుంటుంది.

– విశ్వనాథ సుబ్బారావు

m: 8500841585



# అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు...

కొందరికి కష్టపడటం ఇష్టం ఉండదు. పైగా తమ విలాసాలకు మాత్రం డబ్బు కావాలి. అంతేకాదు తమది కాని సొమ్మును విరివిగా దానం చేస్తారు. తాము దాన కర్ణుడికి ఏ మాత్రం తీసిపోము అంటారు. దానం చేయడం తప్పు కాదు. కానీ, అది తాము స్వశక్తితో సంపాదించి దానం చేయాలి.

అంతే గానీ మనది కాని సొమ్మును దానం చేసే హక్కూ, అధికారం మనకు లేవు. దానం చేయాలన్నా, విలాస వంతమైన జీవితానికి డబ్బులు కావాలన్నా ఇతరులపై ఆధారపడటం సభ్యత కాదు. సంపాదించే శక్తి లేకపోతే, సంపాదించిన నాడే ఆ పని చేయాలి. అలాంటి ఓ అల్లుడు ఉన్నాడు. అతడు చేసిన ఘనకార్యం ఏమిటంటే –

ఒకామెకు మగ పిల్లలు లేరు. తమకు తోడుగా ఆధారంగా ఉంటాడని అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంది. ఇల్లరికం వచ్చిన ఆ అల్లుడు అత్త గారి ఆస్తి అంతా తనదే అన్నట్టు మెలగ సాగాడు.

విలాసవంతంగా బతకడానికి అలవాటు చేసుకున్నాడు. అలాగే తనవాళ్లను, బంధువులను చేరదీశాడు. వారు అడక్కపోయినా తన గొప్ప కోసం దానధర్మాలు చేయ సాగాడు. ఎవరు ఏది కోరినా వెంటనే వెనకా ముందు చూడకుండా దానం చేయడం ప్రారంభించాడు.

అత్త ఎంతో కష్టపడి దాచుకున్న సొమ్మునంతా మంచి నీళ్లలా ఖర్చు చేయసాగాడు. విచ్చలవిడిగా దానధర్మాలు చేసి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

అందుకే ఇలాంటి వారు తారస పడినప్పుడు 'కష్టపడి పని చేసి సంపాదించాలంటారు పెద్దలు. అందులోంచి మాత్రమే దానం చేయాలంటారు. ఇలా ఇతరుల సొమ్మును దానం చేయడం తగదని చెప్పే సామెత ఇది.

– 'బాల కథా సౌరభం' నుండి...

చరిత్ర పాఠాలు-15

# అన్ని మతాలను ఆదరించిన ఇక్ష్వాకులు

చివరి శాతవాహనుల కాలంలో చెలరేగిన అంతఃపుర కలహాలలో, మత కలహాలలో జోక్యం చేసుకుని మహాతలవర, మహాసేనాపతి పదవులలో ఉన్న వారి సామంతులగు ఇక్ష్వాకులు మూడవ పులుమావిని నిర్మూలించి స్వతంత్ర రాజ్యస్థాపన చేశారని 'యుగపురాణం' ఆధారాన్ని బట్టి చెప్పవచ్చు. మత్స్యపురాణం ఇక్ష్వాకులను శ్రీపర్వతీయులని, ఆంధ్రభృత్యులని, ఏడుగురు రాజులు ఒక శతాబ్దం పాలించారని పేర్కొన్నప్పటికీ విష్ణు పురాణం, జైన ధర్మామృతం ఇక్ష్వాకు రాకుమారులు దక్షిణపథానికి వచ్చి రాజ్యాలు స్థాపించారని పేర్కొనడం వారు కోసల ప్రాంతం (ఉత్తర భారతం లేదా చత్తీస్గఢ్) నుండి వచ్చారేమో అనే అనుమానానికి తావిస్తున్నాయి. ఇక్ష్వాకులను కన్నడిగులని వోగెల్, తమిళులని గోపాలచారి, స్థానికులని కాల్వెల్, ఇక్షు చిహ్నం గల ప్రాచీన స్థానిక గణికులని బి.ఎస్.ఎల్. హనుమంతరావు అభిప్రాయపడ్డారు. కాని నాగార్జున కొండ శాసనాలు మాత్రం ఇక్ష్వాకులు శాక్యముని గౌతమబుద్ధుని వంశం వారని, వాశిష్టిపుత్ర సిరి ఛాంతమూలుడు విజయపురిలో (నేటి నాగార్జునకొండలో) రాజ్యం స్థాపించాడని, మొత్తం నలుగురు రాజులు పాలించారని తెలుపుతున్నాయి. వీరు కృష్ణానదికి ఇటు – అటు గల జిల్లాలలో, అనగా తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర మధ్య కూడలిలో ఉన్న జిల్లాల్లో సుమారు క్రీ.శ. 225 – క్రీ.శ. 355 మధ్య ప్రాంతంలో పరిపాలన చేశారు. శాతవాహన యుగంలో ప్రారంభమయిన అన్ని రంగాల్లో చెప్పుకోదగిన పురోభివృద్ధి కనబడటం ఇక్ష్వాకు యుగ విశేషం.



### శాసనాల ఆధారంగా ఇక్ష్వాకులలో

కింద తెలిపిన నలుగురు రాజులు విజయపురి రాజధానిగా పాలించారు. 1. వాశిష్టిపుత్ర సిరి ఛాంతమూల, 2. మాఢరీపుత్ర వీరపురుషదత్త, 3. ఎహువల ఛాంతమూలు, 4. రుద్రపురుషదత్త. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరిలో దొరికిన శాసనం రుద్రపురుషదత్తుడు కనీసం 18 సంవత్సరాలు పాలించాడని, ఇంతవరకు చరిత్రకారులు భావిస్తున్నట్లు 11 సంవత్సరాలు కాదని విశదం చేసింది. ఇక్ష్వాకులు తమ రాజ్య నిర్వహణలో ఎక్కువగా శాతవాహనుల పరిపాలనా విధానాన్నే అనుసరించారు. మొదటి ఛాంతమూలుడు మహారాజు బిరుదాన్ని ధరించాడు. సామంతులు, విదేశీయులతో వివాహ సంబంధాలను ఏర్పరుచుకోవడం ప్రారంభించాడు. ఇక్ష్వాకులు తమ రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించి పూగీయ, చాళుక్య, పల్లవ (?) తదితర వంశాల/సామంతుల పాలనలో ఉంచారు.

### మతం

ఇక్ష్వాకులలో మొదటి రాజు వైదిక, పౌరాణిక మతాలను, రెండవ రాజు బౌద్ధమతాన్ని, మూడవ రాజు బౌద్ధ, శైవాలను రెండింటినీ అనుసరించారు. మొదటి ఛాంతమూలుని పుత్ర పౌత్రుల శాసనాల ఆధారంగా ఆయన అగ్నిహోత్ర, అగ్నిష్టోమ, అశ్వమేధ, వాజపేయ యాగాలను చేసి, అనేక కోట్ల హిరణ్యాలను (బంగారు నాణేలను?), వందవేల గోవులను, వందవేల నాగళ్లను దానం చేశాడని తెలుస్తున్నది. ఇతని అశ్వమేధ వేదిక నాగార్జునకొండలో బయల్పడింది. ఈయన మహాసేన విరూపాక్షుని భక్తుడు. కాబట్టి నాగార్జునకొండలో కనిపిస్తున్న కొన్ని మహాసేనాలయాలను ఈయనే కట్టించాడని భావించవచ్చు. వీరపురుషదత్తుని 18వ రాజ్య సంవత్సరంలో అతని ఆయుర్వృద్ధికి, రాజ్యవృద్ధికి అతని అత్త దానధర్మాలు చేసింది. ఆయన కాలం బౌద్ధమతానికి సువర్ణయుగం. అంతఃపుర స్త్రీలు అనేకులు బౌద్ధ సంస్థలకు దానధర్మాలు చేశారు. ఆయన 6వ రాజ్యవర్షంలో మహాచైత్యాన్ని పునరుద్ధరించి ఆయక స్థంభాలు నిలిపారు. విజయపురి (శ్రీపర్వతం) మహాయాన బౌద్ధానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచి విదేశీ యాత్రికుల నాకర్షించింది. అలాంటి వారి కోసం సింహళ విహారం తదితర వసతులు ఏర్పరుచబడ్డాయి. వీరపురుషదత్తుని కాలంలో రాజభాండాగారిక బోధిశర్మ మేనకోడలు ఉపాసిక బోధిసిరి తామ్రపర్ణి (శ్రీలంక), కాశ్మీర, గాంధార, చీన, చిలాట, తోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన, ద్రమిల, పాలూరాది రాజ్యాల్లో బౌద్ధాన్ని ప్రచారం చేసే భిక్షుకుల కోసం శ్రీపర్వతంలో (నాగార్జున కొండలో) ఛుళధమ్మగిరిపై చైత్యగృహాన్ని, కులహ విహారం దగ్గర చైత్యాన్ని, సింహళ విహారంలో బోధి వృక్షానికి వేదికను, మహాధమ్మగిరిపై గృహాన్ని, దేవగిరిపై ప్రార్థనశాలను, పూర్వ శైలంపై తటాక మంటపశాలలను, కంటక శైల మహాచైత్య తూర్పు ద్వారంలో శిలామంటపాన్ని, హీతువ ముత్తు వద్ద మూడు గదులను, పపిలి దగ్గర ఏడు గదులను, పుష్పగిరిపై శిలామంటపాన్ని నిర్మించింది.

ఎహువల ఛాంతమూలుని కాలంలో బౌద్ధం, పౌరాణిక బ్రాహ్మణ మతం రెండూ పోషించబడ్డాయి. బౌద్ధ మతస్థులలో అపర మహావినశైలీయులు, బహు శ్రుతీయులు, మహీశాసకులు అని ఎన్నో శాఖలవారు ఏర్పడ్డారు. సేనాని ఎలిసిరి కుమారస్వామికి సర్వదేవాధివాసాన్ని, రాకుమారుడు వీరపురుషదత్తుడు పుష్పభద్రుడనే దేవుడికి (శివుడికి) ఆలయాన్ని నాగార్జునకొండలో నిర్మించారు. ఒక అంతఃపురాంగన నొడగిరి స్వామికి దానధర్మాలు చేసింది. ఎహువల కాలంలోనే శక రాజు అభీరక వసుసేనుని సేనాని శివసేనుడు అష్టభుజస్వామి (నారాయణుడు) విగ్రహాన్ని నాగార్జునకొండలో ప్రతిష్టించాడు. నాగార్జునకొండలో ఉన్న హారీతి దేవాలయంలోని సప్తమాతృకల వద్ద నాటి స్త్రీలు సంతానం కోసం గాజులు సమర్పించేవారు. మంచికల్లు శాసనం తీర్థయాత్రికులను ప్రస్తావించింది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# Word Puzzle Game




| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| D | V | S | P | R | D | E | L | W | W | K |
| T | X | P | F | F | K | L | D | D | R | P |
| S | C | I | T | S | A | N | M | Y | G | J |
| W | W | F | O | D | U | J | B | S | J | Y |
| Z | Y | O | V | B | J | H | E | N | T | S |
| Y | T | A | E | K | W | O | N | D | O | O |
| G | T | U | L | L | A | B | E | S | A | B |
| M | J | I | R | M | S | O | C | C | E | R |
| S | V | O | L | L | E | Y | B | A | L | L |
| C | G | N | I | X | O | B | M | A | K | I |
| P | M | H | W | B | R | B | N | C | H | D |





- baseball - volleyball - gymnastics - judo - boxing - taekwondo - soccer




# కలంచెలిమి



**షేక్ సుమయ్య**
9వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ),
కర్నూలు -518001.



**సుమీత్**
8వ తరగతి,
జడ్. పి. హెచ్. ఎస్,
ఇంద్రవెల్లి, ఆదిలాబాద్.

**ఇ. దీక్షిత**
9వ తరగతి, జడ్. పి. హెచ్. ఎస్,
సిర్సవాడ, తాడూర్,
నాగర్ కర్నూల్.



**యం. మనోజ్**
6వ తరగతి, జడ్. పి. హెచ్. ఎస్,
పెద్ద బోదనం, నంద్యాల,
ఆంధ్రప్రదేశ్.






**జి. అక్షయ**
9వ తరగతి, జడ్. పి. హెచ్. ఎస్,
రహీంఖాన్‌పేట



**ఎండీ సాదియా**
4వ తరగతి,
ఎంపీపీఎస్ రచ్చపల్లి.

కథ

# జీవిత ప్రయాణం



నేను బస్సులో ప్రయాణం చేసినప్పుడు ఒక వృద్ధురాలు గోరంటాల అనే గ్రామంలో బస్సు ఎక్కింది. ఆమెకు సరిగ్గా నడవరాదు. తాను ఎవరైన కూర్చోవడానికి చోటు ఇవ్వండి బిడ్డ అని అడిగింది. అప్పుడు నేను అమ్మ మీరు ఇక్కడ కూర్చోండి అని అన్నాను. 'తాను కూర్చొని నీ కడుపు సల్లగుండా బిడ్డ అని అన్నది. నన్ను నా కొడుకు ఇంటి నుండి తరిమివేశాడు. వృద్ధాశ్రమంలో చేర్చాడు. ఏం చేయస్తది బిడ్డ' అని అన్నది. మేము ఏమో కష్టపడి పెద్ద పెద్ద చదువు చదివించి మంచి ఉద్యోగాలు తెప్పించి వాళ్ళ కష్ట సుఖాలు పాలు పంచుకుంటాం. వాళ్ళని మంచిగా చూసుకుంటాం. వాళ్ళ పెండ్లిలు చేసాక వాళ్ల వీళ్ల మాటలు విని మమ్ములను సరిగ్గా చూసుకోరు. మేము కొంచెం ముసలివాళ్ళం అయ్యాక మా కష్టంతో సంపాదించిన భూములు లాక్కొని వాళ్ళ పేరుల మీద రాయించుకుంటారు. మమ్మల్ని సరిగ్గా చూసుకోరు. సమయానికి అన్నం పెట్టారు. ఆడవాళ్ళు ఒక ఇంటికి కోడలిగా వెళ్ళారుగా. మీ అత్తమ్మ మామయ్యను మంచిగా చూసుకోండి. మీ అమ్మ నాన్నలుగా చూసుకోండి. అమ్మ నాన్న మనల్ని 9 నెలలు మోసి వాళ్ళు మనల్ని పోషించి ఎంతో కష్టపడి ఎన్నో అనుకొని మనలను పెద్ద చేస్తారు. అట్లాంటి అమ్మా నాన్నలను తీసుకెళ్లి వృద్ధాశ్రమం చేర్చడం మంచిది కాదు. అమ్మ నాన్నలకు సమయానికి బువ్వ పెట్టండి. వైద్యం చేయించండి. మనము వాళ్ళకు చాలా ఋణపడి ఉంటాము. వాళ్ల ఋణం తీర్చుకోవాలంటే వాళ్ళు బతికి ఉన్నంత కాలం మనం ఎంత పెద్ద పనిల్లో ఉన్న వాళ్లతోని కాసేపు సమయం గడపాలి. వాళ్ళ మనసుల్లో ఎప్పుడు ఒంటరి అని అనుకోవద్దు. నేను ఇది సమాజానికి చెప్తున్నాను. మీ అమ్మ నాన్నలను దయచేసి వృద్ధాశ్రమంలో చేర్చకండి అని సంచిలో ఉన్న బిస్కెటు పాకెట్ ఇస్తూ నిజంగా నా మనవరాలిని చూసినట్లే ఉంది బిడ్డా అని వంద రూపాయల నోటిచ్చింది. నేను చేసిన చిన్న సహాయమే కాని....


– ఎస్. భావన

9వ తరగతి, జెడిపిహెచ్ఎస్ గంభీరావు పేట

ఎం. శివ (టీచర్), m: 90009 28576


## సామెతలు

- అడిగినట్టు యిస్తే, కడిగినట్టు పోతుంది.
- ఆడబోయిన తీర్థం ఎదురాయెనన్నట్లు.
- ఇల్లే తీర్థం, వాకిలే వారణాసి, కడుపే కైలాసం.
- ఉపాయం లేనివాణ్ణి ఊళ్లో నుంచి వెళ్లగొట్టమన్నారు.
- ఊహలు ఊళ్లేలుతుంటే కర్మం కట్టెలు మోస్తున్నది.
- ఎక్కువ తెలివి ఏడ్పుల కారణం, తక్కువ తెలివి తన్నుల కారణం.
- ఏడు మెతుకులు తింటే ఏనుగంత సత్తువ.
- ఒక పాము చేత రెండు సార్లు కరిపించుకుంటామా?
- కంచె చేను మేస్తే కాపేమి చేయగలదు.
- గంగిగోవు పాలు గరిటెడైనా చాలు.

– బాలచెలిమి డెస్క్

# కోరుకున్న అంకె

1. ఏదైనా ఒక (1-9) అంకెను కోరుకోమనాలి.
2. మీరు చెప్పిన సంఖ్యనుండి ఆ అంకెను తీసివేయమని చెప్పాలి.
3. తీసివేయగా వచ్చిన జవాబును మీకు చెప్పమనాలి.
4. అది విని వారు కోరుకున్న అంకెను చెప్పాలి.

ఉదా: 8 కోరుకున్నారు. మీరు 72 నుండి తీసి వేయమని చెప్పారు.

72-8-64

64 అని చెప్పగానే మీరు కోరుకున్నది 8 అని చెప్పాలి.

**రహస్యం:** మీరు చెప్పే సంఖ్య ఖచ్చితంగా 9 యొక్క గుణిజమై ఉండాలి. వారు చెప్పిన జవాబులోని అంకెలన్నింటినీ ఒక అంకె వచ్చేవరకు కూడి దానిని 9 నుండి తీసివేయాలి. ఒక అంకె వచ్చేవరకు కూడినప్పుడు 9 వస్తే వాళ్లు కోరుకున్నది కూడా 9 అవుతుంది.

## BEAUTY NUMBER

142857 x Sevens' multiplies

142857 x 7 = 0999999

142857 x 14 = 1999998

142857 x 21 = 2999997

142857 x 28 = 3999996

142857 x 35 = 4999995

142857 x 42 = 5999994

142857 x 49 = 6999993

142857 x 56 = 7999992

142857 x 63 = 8999991

- అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937



# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------


మొబైల్ : ------------------

ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com





# డీప్ లర్నింగ్ ఆధారిత డేటా విశ్లేషణ పద్ధతులు

డీప్ లెర్నింగ్ (Deep Learning) అనేది ఆధునిక కృత్రిమ మేధస్సు (Artificial Intelligence - AI) లో అత్యంత ప్రాముఖ్యమైన సాంకేతికతలలో ఒకటి. ఇది మెషీన్ లెర్నింగ్ (Machine Learning) యొక్క ఉపశాఖగా పరిగణించబడుతుంది. డీప్ లెర్నింగ్ ప్రధానంగా కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌లు (Artificial Neural Networks) ఆధారంగా పని చేస్తుంది. ఇవి మనిషి మెదడులోని న్యూరాన్‌ల నిర్మాణాన్ని అనుకరిస్తాయి. "డీప్" అనే పదం అనేక స్థరాలు (Layers) ఉన్న నెట్‌వర్క్‌ను సూచిస్తుంది.

డీప్ లెర్నింగ్‌లో డేటా ప్రాసెసింగ్ అనేది పలు స్థరాల ద్వారా జరుగుతుంది. మొదటగా ఇన్‌పుట్ లేయర్ (Input Layer) డేటాను స్వీకరిస్తుంది. తరువాత హిడెన్ లేయర్లు (Hidden Layers) డేటాలోని ముఖ్యమైన లక్షణాలను గుర్తించి ప్రాసెస్ చేస్తాయి. చివరగా అవుట్‌పుట్ లేయర్ (Output Layer) తుది ఫలితాన్ని అందిస్తుంది. ఈ ప్రక్రియలో వెయిట్స్ (Weights) మరియు బయాసెస్ (Biases) అనే గణిత పరామితులు ఉపయోగించబడతాయి.

డీప్ లెర్నింగ్ శిక్షణ (Training) ప్రక్రియలో లాస్ ఫంక్షన్ (Loss Function) ద్వారా పొరపాటును కొలుస్తారు. తరువాత బ్యాక్‌ప్రొపగేషన్ (Backpropagation) మరియు గ్రాడియెంట్ డిసెంట్ (Gradient Descent) పద్ధతుల ద్వారా నెట్‌వర్క్ తన తప్పులను సరిచేసుకుంటుంది. ఈ విధంగా మోడల్ క్రమంగా మెరుగుపడుతుంది.

డీప్ లెర్నింగ్ చరిత్రను పరిశీలిస్తే, 1943లో మొదటి న్యూరల్ నెట్‌వర్క్ మోడల్ ప్రతిపాదించబడింది. 1980లలో బ్యాక్‌ప్రొపగేషన్ అభివృద్ధి చెందడంతో ఈ రంగంలో పురోగతి సాధించబడింది. అయితే 1990లలో కంప్యూటింగ్ వనరుల కొరత కారణంగా అభివృద్ధి మందగించింది. 2010 తర్వాత బిగ్ డేటా (Big Data), గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (GPUs) మరియు క్లౌడ్ కంప్యూటింగ్ (Cloud Computing) వలన డీప్ లెర్నింగ్ వేగంగా అభివృద్ధి చెందింది.

డీప్ లెర్నింగ్‌లో వివిధ రకాల మోడళ్లు ఉన్నాయి. కన్వల్యూషనల్ న్యూరల్ నెట్‌వర్క్‌లు (Convolutional Neural Networks - CNN) చిత్రాల విశ్లేషణలో ఉపయోగిస్తారు. రికరెంట్ న్యూరల్ నెట్‌వర్క్‌లు (Recurrent Neural Networks - RNN) మరియు ఎల్ఎస్‌టీఎమ్ (LSTM) వరుస డేటా (Sequential Data)

కోసం ఉపయోగపడతాయి. ట్రాన్స్‌ఫార్మర్ (Transformer) మోడళ్లు భాషా ప్రాసెసింగ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాయి. డీప్ లెర్నింగ్ అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగించ బడుతుంది. ఆరోగ్య రంగంలో వ్యాధుల గుర్తింపు, ఎక్స్-రే మరియు ఎంఆర్ఐ విశ్లేషణలో ఉపయోగిస్తారు. ఆర్థిక రంగంలో మోసాల గుర్తింపు (Fraud Detection) మరియు రిస్క్ అనాలిసిస్‌లో ఉపయోగిస్తారు. వాహన రంగంలో స్వయంచాలక వాహనాల (Self-driving cars) అభివృద్ధికి ఇది కీలకం. ఈ-కామర్స్‌లో వినియోగదారుల ప్రవర్తన విశ్లేషణ మరియు సిఫార్సు వ్యవస్థలు (Recommendation Systems) లో ఉపయోగిస్తారు. డీప్ లెర్నింగ్ ప్రయోజనాలు అనేకం. ఇది అధిక ఖచ్చితత్వంతో ఫలితాలు ఇస్తుంది. స్వయంగా ఫీచర్లను గుర్తించే సామర్థ్యం కలిగి ఉంటుంది. భారీ డేటాను సులభంగా నిర్వహించగలదు. అయితే కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. దీనికి ఎక్కువ డేటా మరియు అధిక కంప్యూటింగ్ శక్తి అవసరం. అదనంగా, ఇది ఎలా నిర్ణయం తీసుకుంటుందో అర్థం చేసుకోవడం కష్టం, దీనిని "బ్లాక్ బాక్స్" సమస్య అంటారు.

ప్రొఫెషనల్ దృష్టికోణంలో డీప్ లెర్నింగ్ ఒక విస్తృతమైన అవకాశాలను కలిగిన రంగం. డేటా సైంటిస్టులు, AI ఇంజనీర్లు, పరిశోధకులు ఈ సాంకేతికతను ఉపయోగించి కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. పైథాన్ (Python), టెన్సర్‌ఫ్లో (TensorFlow), పైటార్చ్ (PyTorch) వంటి సాధనాలు ఈ రంగంలో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి.

డీప్ లెర్నింగ్ భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం పొందే సాంకేతికత. ఇది ఆరోగ్యం, విద్య, రవాణా, భద్రత వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ, స్మార్ట్ ప్రపంచ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుంది.

– లత
e: ogshydcbse@gmail. com



# మధుమేహానికి ఆజ్యం పోస్తున్న ఫాస్ట్‌ఫుడ్ రుచులు

తెలంగాణ పట్టణ ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ మహానగర ప్రజల ఆహార అలవాట్లు గణనీయంగా మారడంతో టైప్-2 డయాబెటిస్ కేసులు పెరుగుతున్నాయని తాజాగా ఐసిఎంఆర్ విడుదల చేసిన "ఫాస్ట్-ఫుడ్ అట్రిబ్యూటెడ్ డయాబెటిస్ ఇండెక్స్ స్టడీ (ఎఫ్ఏడిఐఎస్)" అనబడే నివేదిక స్పష్టం చేస్తున్నది. పారిశ్రామిక ఫాస్ట్-ఫుడ్, ప్రాసెస్డ్ అండ్ ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్ ఫుడ్ రుచులకు అలవాటు పడిన ప్రజలు రానున్న "నిశ్శబ్ద ప్రజారోగ్య సంక్షోభాని"కి గురి కానున్నట్లు ఈ నివేదిక హెచ్చరిస్తున్నది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో "ఐసిఎంఆర్-ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్"తో కలిసి "మాయో క్లినిక్", "యూఎస్", "యూనివర్సిటీ ఆఫ్ అలబామా-యూఎస్"లు కలిసి సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో పలు ప్రజారోగ్య సమస్యలకు దారి తీస్తున్నట్లు తెలుస్తున్నది.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
m : 9949700037 (తాజాగా విడుదలైన "ఐసిఎంఆర్ – ఎఫ్ఏడిఐఎస్ నివేదిక" ఆధారంగా)



# నక్క - నీలిరంగు

ఒకప్పుడు ఒక అడవిలో ఒక నక్క ఉండేది. ఆ నక్క చాలా తెలివైనది, కానీ కొన్ని రోజులుగా దానికి ఆహారం దొరకకపోవడంతో ఆకలితో చాలా ఇబ్బంది పడుతోంది. అందుకే అది గ్రామం వైపు వెళ్లాలని నిర్ణయించుకుంది.

ఒక సాయంత్రం నిశ్శబ్దంగా గ్రామం వైపు అడుగులు వేసింది. అక్కడ కోళ్లూ, మేకలూ కనిపించాయి. వాటిని పట్టుకోవాలని ప్రయత్నించగానే, గ్రామంలోని కుక్కలు గమనించాయి. వెంటనే గట్టిగా మొరుగుతూ నక్కను తరిమాయి. భయంతో వణికిపోయిన నక్క ప్రాణాల కోసం పరుగెత్తింది. ఎక్కడికి పోవాలో అర్థం కాక, అటూ ఇటూ పరిగెడుతూ చివరికి ఒక ఇంటి వెనుక ఉన్న పెద్ద గుంటలో పడిపోయింది. అది సాధారణ గుంట కాదు. అక్కడ బట్టలకు రంగు వేయడానికి ఉపయోగించే నీలి రంగు ద్రావణం (blue dye) నిండి ఉంది. కొంతసేపటి తర్వాత నక్క బయటికి వచ్చింది. తాను బతికి బయటపడినందుకు ఊపిరి పీల్చుకుంది. కానీ తన శరీరాన్ని చూసి ఆశ్చర్యపోయింది. మొత్తం శరీరం నీలం రంగులోకి మారిపోయింది! తనను తాను గుర్తుపట్టలేకపోయింది.

అలా ఆశ్చర్యంతో అడవిలోకి తిరిగి వెళ్లింది. అక్కడ ఉన్న సింహం, పులి, ఎలుగుబంటి, జింకలు, కుందేళ్లు ... అన్నీ ఆ నక్కను చూసి కంగారు పడ సాగాయి.

"ఇది ఏ కొత్త జంతువు?"

"ఇది ఇంతవరకు చూడలేదు!"

"ఇది ప్రమాదకరమేమో!"

అంటూ భయంతో చర్చించుకున్నాయి.

ఈ పరిస్థితిని గమనించిన నక్కకు ఒక ఆలోచన వచ్చింది. వెంటనే గంభీరంగా మాట్లాడింది:

"జంతువులారా! భయపడకండి. నేను దేవుడు పంపిన ప్రత్యేక జంతువు. మీ అందరికీ రక్షణ ఇవ్వడానికి వచ్చాను. ఇకమీదట ఈ అడవికి రాజు నేనే!"

సింహం కూడా కొంచెం సందేహపడ్డా, ఆ వింత రంగు చూసి నమ్మింది. అందరూ కలిసి ఆ నక్కను రాజుగా అంగీకరించారు. అప్పటి నుంచి నక్క రాజులా జీవించసాగింది నక్కకి ఇక ఆకలి అనే సమస్య లేదు. అది చాలా ఆనందంగా రోజులు గడిపింది.

ఒక రోజు ఆకాశం మబ్బులతో నిండిపోయింది. గాలి



బలంగా వీచింది. కొద్దిసేపట్లోనే భారీ వర్షం మొదలైంది. అన్ని జంతువులు చెట్ల కింద దాక్కున్నాయి. నక్క కూడా వర్షంలో తడిసి పోయింది. కొంతసేపటికి నక్క శరీరంపై ఉన్న నీలి రంగు క్రమంగా కడిగిపోవడం ప్రారంభమైంది. వర్షపు నీరు ఆ రంగును కరిగిస్తూ తీసుకుపోయింది. కొద్దిసేపటికి నక్క మళ్లీ తన అసలు రంగులోకి వచ్చింది.

ఇది చూసిన జంతువులు ఆశ్చర్య పోయి, వెంటనే నిజం గ్రహించాయి.

"ఇది అదే పాత నక్కే!"

"మనలను మోసం చేసింది!"

అని కోపంతో అరిచాయి. సింహం గర్జించింది, పులి దూసుకువచ్చింది. భయపడిన నక్క అక్కడి నుంచి ప్రాణాల కోసం పారిపోయింది.

### ఈ కథలో సైన్స్ ఏమిటి?

### 1.నక్కకు ఆ రంగు ఎందుకు అంటుకుంది?

రంగులు (dyes) అనేవి రసాయన పదార్థాలు. ఇవి జంతువుల వెంట్రుకలపై లేదా వస్త్రాలపై అంటుకుంటాయి. నక్క వెంట్రుకలపై రంగు అణువులు (molecules) అంటుకోవడం వల్ల అది నీలంగా కనిపించింది.

### 2.వర్షంలో రంగు ఎందుకు పోతుంది?

వర్షపు నీరు ఒక మంచి ద్రావకం (solvent). నీరు ఆ రంగు అణువులను క్రమంగా కరిగించి తీసుకుపోతుంది. అందుకే నక్క మళ్లీ తన అసలు రంగులోకి వచ్చింది.

నక్క పడింది ఒక సాధారణ రంగు ద్రావణంలో (dye solution). ఆ రంగు జుట్టు మీద మాత్రమే అంటుకుంది, జుట్టు లోపలికి వెళ్లలేదు. అందువల్ల వర్షం పడినప్పుడు నీరు ఆ రంగును సులభంగా కరిగించి తీసుకుపోయింది. అందుకే నక్క మళ్లీ తన అసలు రంగులోకి వచ్చింది.

### 3.మనుషుల జుట్టుకు రంగు వేయడం వెనుక దాగి ఉన్న సైన్స్

మన జుట్టుకు రంగు వేయడం (hair coloring / hair dyeing) వెనుక బలమైన రసాయన శాస్త్రం (Chemistry) ఉంది. మన జుట్టు ప్రధానంగా కెరాటిన్ (Keratin) అనే ప్రోటీన్‌తో తయారవుతుంది. జుట్టు సహజ రంగు మెలానిన్ (Melanin) అనే పిగ్మెంట్ వల్ల వస్తుంది.

జుట్టుకు రంగు వేయడానికి ఉపయోగించే hair dyeలో కొన్ని ముఖ్యమైన రసాయనాలు ఉంటాయి:

(A) అమోనియా : ఇది జుట్టు క్యూటికల్‌ను తెరుస్తుంది, అంటే జుట్టు లోపలికి రంగు వెళ్లడానికి మార్గం కల్పిస్తుంది

(B) హైడ్రోజన్ పెరాక్సైడ్ : ఇది సహజ రంగు (melanin)ను కొంతవరకు తొలగిస్తుంది (bleaching effect), కొత్త రంగు బాగా కనిపించడానికి సహాయం చేస్తుంది

(C) డై మాలిక్యూల్స్ : ఇవి జుట్టులోకి వెళ్లి కోర్టెక్స్‌లో స్థిరపడతాయి, అందుకే రంగు ఎక్కువకాలం ఉంటుంది

### 4. నక్క రంగు వర్షంలో పోయింది... మరి మనం జుట్టుకి వేసిన రంగు ఎందుకు పోదు?

నక్క పడింది ఒక సాధారణ రంగు ద్రావణంలో (dye solution). ఆ రంగు జుట్టు మీద మాత్రమే అంటుకుంది, జుట్టు లోపలికి వెళ్లలేదు. అందువల్ల అది తాత్కాలిక (temporary) రంగు మాత్రమే. వర్షం పడినప్పుడు నీరు ఆ రంగును సులభంగా కరిగించి తీసుకుపోయింది. ఆ రంగుకు జుట్టుతో బలమైన బంధం లేకపోవడం వల్ల అది త్వరగా పోయింది.

కానీ మనం జుట్టుకు వేసే hair dye మాత్రం భిన్నంగా పనిచేస్తుంది. ఇందులో ఉన్న రసాయనాలు జుట్టు బయట పొర (cuticle)ను తెరిచి, రంగును లోపల (cortex) వరకు చేర్చుతాయి. అక్కడ అది జుట్టుతో బలమైన రసాయన బంధం (chemical bond) ఏర్పరుచుకుంటుంది. అందుకే ఈ రంగు వర్షంలో లేదా నీటితో కడిగినప్పుడు సులభంగా పోదు. అది క్రమంగా మాత్రమే తగ్గుతుంది కానీ ఒక్కసారిగా పోదు.

- కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320

# నియంత్రణ సంస్థలు, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలు

| పేరు | స్థాపన | హెడ్‌క్వార్టర్స్ | చైర్మన్ / గవర్నర్ / CEO |
|---|---|---|---|
| **నియంత్రణ సంస్థలు (Regulatory Bodies)** | | | |
| SEBI (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) | 1988 (చట్టబద్ధం: 1992) | ముంబై | తుహిన్ కాంత పాండే |
| IRDAI (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా) | 1999 | హైదరాబాద్ | అజయ్ సేథ్ |
| CCI (కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) | 2003 | న్యూ ఢిల్లీ | రవ్నీత్ కౌర్ |
| PFRDA (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ) | 2003 | న్యూ ఢిల్లీ | శివసుబ్రహ్మణియన్ రమణ్ |
| **బ్యాంకులు (Banks)** | | | |
| రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) | 1935 | ముంబై | సంజయ్ మల్హోత్రా |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) ("ప్రతి భారతీయుడి బ్యాంకర్") | 1955 | ముంబై | చల్లా శ్రీనివాసులు సెట్టి |
| HDFC బ్యాంక్ (We Understand Your World) | 1994 | ముంబై | శశిధర్ జగదీశన్ |
| Axis బ్యాంక్ | 1993 | | అమితాబ్ చౌధరి |
| బ్యాంక్ ఆఫ్ బరోడా (BOB) | 1908 | వడోదరా | దేవదత్త చంద్ర |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (CBI) | 1911 | | కళ్యాణ్ కుమార్ |
| ఫెడరల్ బ్యాంక్ (Federal) | 1931 | అలువా | KVS మణియన్ |
| RBL బ్యాంక్ | 1943 | | ఆర్. సుబ్రహ్మణియకుమార్ |
| సౌత్ ఇండియన్ బ్యాంక్ (South Indian) | 1929 | | పి. ఆర్. శేషాద్రి |
| YES బ్యాంక్ | 2004 | | ప్రశాంత్ కుమార్ |
| J&K బ్యాంక్(Jammu & Kashmir) | 1938 | | శ్రీనగర్ |
| కర్ణాటక గ్రామీణ బ్యాంక్ (Karnataka Grameena) | 2025 | | బళ్లారి |
| **ఆర్థిక సంస్థలు (Financial Institutions)** | | | |
| నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్(NABARD) | 1982 | | శాజీ కె వి |
| వరల్డ్ బ్యాంక్ (World Bank) | 1944 | వాషింగ్టన్ DC | అజయ్ బంగా |
| PhonePe | | బెంగళూరు | సమీర్ నిగమ్ |
| Paytm (One97 Communications) | | నోయిడా | విజయ్ శేఖర్ శర్మ |

– బాలచెలిమి డెస్క్



## భారతీయ ప్రకృతి వైవిధ్యానికి ప్రతీక

# గ్రేట్ ఇండియన్ బస్టర్డ్

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ లేదా గోదావాన్ లేదా బట్టమేక పిట్ట భారతదేశానికి ప్రత్యేకమైన, అత్యంత అరుదైన పక్షి. ఇది రాజస్థాన్ రాష్ట్ర పక్షిగా గుర్తింపు పొందింది. పూర్వం అనేక రాష్ట్రాల్లో విస్తరించి ఉండేది, కానీ ఇప్పుడు ప్రధానంగా రాజస్థాన్ గడ్డి మైదానాల్లో మాత్రమే కనిపిస్తుంది. అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంఘం (IUCN) ప్రకారం, ఈ పక్షి "అత్యంత ప్రమాదం"లో ఉన్న జాతిగా ఉంది. విద్యుత్ తీగలకు ఢీకొనడం, వేటకు గురికావడం, నివాస నష్టం వంటి కారణాల వల్ల ఈ పక్షి మరింత ప్రమాదంలో ఉంది. 1960లలో వెయ్యి కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్న పక్షులు, ఇప్పుడు కేవలం 150-100 మాత్రమే మిగిలి ఉన్నాయి. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ జీవనశైలి సున్నితమైనది. ప్రతి పక్షి 15-20 కిలోల బరువు కలిగి ఉంటుంది. పొడవాటి మెడ, పొడవైన కాళ్లు దీని ప్రత్యేకత. ఈ పక్షి ఏడాదికి ఒక్క గుడ్డు మాత్రమే పెడుతుంది, మరియు తల్లి 27 రోజుల పాటు గుడ్డును సంరక్షిస్తుంది. ప్రకృతి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, రైతులకు క్రిమినిర్వాణంలో సహాయం చేస్తుంది. చిన్న సంఖ్య, తక్కువ సంతానోత్పత్తి, మరియు పరిరక్షణ చర్యల కొరత వల్ల జాతి భవిష్యత్తు ప్రమాదంలో ఉంది. "ప్రాజెక్ట్ బస్టర్డ్ -2013" రాజస్థాన్‌లో ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా జాతిని కాపాడటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కృత్రిమ గర్భధారణ విధానం విజయవంతంగా ఉపయోగించబడింది. జైసల్మేర్ సంతానోత్పత్తి కేంద్రంలో మగ పక్షి వీర్యాన్ని తీసుకుని, 200 కిలోమీటర్ల దూరంలోని ఆడ పక్షికి ఉపయోగించడం ద్వారా సంతానోత్పత్తి కొనసాగుతోంది. సంతానోత్పత్తి కేంద్రంలో పుట్టిన పక్షి పిల్లలను మెల్లగా అడవుల్లో విడుదల చేస్తూ జాతి భవిష్యత్తు రక్షణ లక్ష్యాన్ని సాధిస్తున్నారు.

గుజరాత్ అబ్దసా గడ్డి భూముల్లో 2026 మార్చి 26న అరుదైన బస్టర్డ్ పిల్ల పుట్టింది. ఇది ప్రపంచంలో అత్యంత ప్రమాదంలో ఉన్న జాతిలోకి వస్తుంది. అందుకే గుజరాత్ అటవీ విభాగం 50 మంది సిబ్బందితో మూడు షిఫ్టులుగా పక్షి పిల్లలను 24 గంటల పర్యవేక్షణలో ఉంచుతున్నారు. వాచ్ టవర్స్, దూరదర్శిని(స్పాటింగ్ స్కోప్), కంటి గాజులు(బైనాక్యులర్లు) ఉపయోగించి పక్షి పిల్లలపై నిఘా ఉంచబడింది. సమీప రహదారులు మూసివేయబడ్డాయి. ఇతర జంతువులు రాకుండా ఫెన్సింగ్, తవ్వకాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక కృత్రిమ నీటి గుంటలు ఏర్పాటు చేయబడ్డాయి. మొదటి నెల అత్యంత కీలకం, ఈ సమయంలో పక్షి పిల్ల స్వతంత్రంగా ఎగరగలగాలి. ఆంధ్రప్రదేశ్‌లో బట్టమేక పిట్ట ప్రధానంగా రోళ్లపాడు వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో నివసిస్తుంది. 1979లో పక్షి ప్రాధాన్యతను గుర్తించిన తరువాత 1980లో నోబల్ అవార్డు గ్రహీత సలీం అలీ వన్యప్రాణి సంరక్షణ చర్యలు ప్రారంభించారు. 1988లో 600 హెక్టార్ల భూభాగం అభయారణ్యంగా ప్రకటించబడింది, అదనంగా అలగనూరు వద్ద 800 ఎకరాలు కేటాయించబడ్డాయి. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ కేవలం ఒక పక్షి మాత్రమే కాదు. ఇది రాజస్థాన్ రాష్ట్ర పక్షి మరియు భారతదేశ ప్రకృతి వైవిధ్యానికి ప్రతీక. పర్యావరణవేత్తలు సంతానోత్పత్తి కేంద్రాలు, అభయారణ్యాలు, గడ్డి భూముల సంరక్షణ, విద్యుత్ తీగల మార్పు వంటి చర్యలను అత్యంత కీలకంగా సూచించారు. ప్రజలలో అవగాహన పెంపొందించడం ద్వారా ఈ అరుదైన జాతిని భవిష్యత్తు తరాలకు కాపాడవచ్చు. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ కాపాడటం అంటే భారత ప్రకృతి వైవిధ్యాన్ని, భవిష్యత్తు తరాల బాధ్యతను రక్షించడం.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036



కథ

# స్నేహం విలువ



నవ్య ఒక సామాజిక పేద కుటుంబంలో జన్మించింది. అశోక్ లావణ్య తన తల్లిదండ్రులు. శివసాయి సోదరుడు. నవ్య తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతూ నవ్యను నర్సరీ ఎల్.కె.జి., యు.కె.జి. చదివించారు. నవ్య వారి నాన్న ఎంతో త్రాగివచ్చి రోజు గొడవ పడుతుండేవారు. నవ్య వాళ్ళ నాన్నమ్మ పట్టించుకునేది కాదు. తన బిడ్డ వైపు ఉండేది. నవ్య చదువు తన అమ్మమ్మ ఇంటి దగ్గరనే కొనసాగింది. ఒకటవ తరగతి నుండి నాలుగవ తరగతి వరకు అక్కడే చదువుకుంది. నాలుగవ తరగతి పూర్తి అయిన తరువాత నవ్యను గురుకుల హాస్టల్‌లో చేర్పించారు. ఏమి ఎరుగని వయసులో నవ్య ఎన్నో కష్టాలను ఎదురుకుంటూ చదువుకుంది. అలా 6వ తరగతిలో నవ్య నలుపుగా ఉందని తన స్నేహితులు నవ్యని ఒంటరిదాన్ని చేశారు. బెడ్డు లేక నవ్య కటికనేలపై పడుకుంది. ఇలా ఎన్నో కష్టాలు ఎదుర్కొనే నవ్యకి ఎనిమిదవ తరగతిలో శ్రీవిక అనే స్నేహితురాలు దొరికింది. శ్రీవిక నవ్యతో మంచిగానే ఉండేది. శ్రీవిక అంటే నవ్యకు ఎంతో ఇష్టం. శ్రీవిక పుట్టిన రోజున శ్రీవికకు నవ్య నువ్వు నా బెస్టి అని చెప్పింది. శ్రీవికకు బెస్టిలు అంటే నచ్చరు. అలా చెప్పడంతో శ్రీవికకు నచ్చలేదు. అప్పటి నుండి శ్రీవిక కూడా నవ్యతో అంత సక్యంగా ఉండడం లేదు. ఇలా స్నేహితుల రోజు నవ్య స్వయంగా తన చేతితో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ తయారు చేసి ఇచ్చింది. ఆ రోజు శ్రీవిక కట్టుకుంది కాని కొన్ని రోజుల తరువాత దాన్ని తెంచి వేసింది. శ్రీవిక నవ్యను సరదగా అప్పుడప్పుడు ఏడ్పిస్తూ ఉండేది. కాని నవ్య అవి ఏవి పట్టించుకునేది కాదు. నవ్యని నొప్పిస్తూ మాట్లాడేది కాని, శ్రీవికకేమి తెలుసు నవ్యకి శ్రీవిక అంటే చనిపోయేంత ఇష్టం అని. శ్రీవికలో నవ్యకు తన కళ్లంటే ఇష్టం. శ్రీవిక మొఖం శ్రీకృష్ణుని మొహంలా అందంగా ఉండేది. శ్రీవిక ఎన్నన్న నవ్య పట్టించుకునేది కాదు. ఇలా నవ్య ఒక రోజు ఇలా ఆలోచించింది. ఏమని అంటే నేను అసలు మా తల్లిదండ్రులకే పడను అలాంటివి శ్రీవిక అంటే ఎందుకు పడుతున్నాను అని చాలా బాధపడింది. కొన్ని రోజులు తరువాత శ్రీవికనే నవ్వుతో మంచిగా మాట్లాడుతుంది. ఇప్పుడు శ్రీవిక నవ్య ఎంతో సంతోషంగా మాట్లాడుకుంటున్నారు ఇప్పటీ కూడా నవ్యకి శ్రీవిక పైన ఎంతో ప్రేమ ఉంది శ్రీవిక కోసం ప్రాణాలర్పించడానికి కూడా సిద్ధంగా ఉంది.

**నీతి : ఓర్పు సహనం మంచి గుణం, మంచి స్వభావం మనిషికి ఎంతో అవసరం. జీవితంలో పోగొట్టుకున్నది మళ్ళీ తిరిగి పొందితే వచ్చే ఆనందం ఎంతో జ్ఞాపకంగా ఉంటుంది.**

– బి. నవ్యశ్రీ

9వ తరగతి, ఎం.జే.పి. గుంజపడుగు, గోదావరిఖని

# బాలచెలిమి గ్రంథాలయం - కథా రచనలో మా తొలి అడుగులు

గౌరవనీయులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి నమస్కారాలు,


మా పాఠశాలలో ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కథారచన" కార్యశాలలో మేము పాల్గొని కథలు రాయడం జరిగింది. ఈ కార్యక్రమం మాకు ఎంతో ఆనందాన్ని, ప్రేరణను కలిగించింది. మా పాఠశాలలో మీరు స్థాపించిన "బాలచెలిమి గ్రంథాలయం" ద్వారా మేము అనేక కథా పుస్తకాలను చదివే అవకాశం పొందాము. ఆ పుస్తకాల ద్వారా మాకు కొత్త విషయాలు తెలుసుకోవడం మాత్రమే కాకుండా, మంచి కథలు రాయడానికి అవసరమైన ప్రేరణ కూడా లభించింది. గ్రంథాలయ వినియోగం వల్ల మేము రాసిన కథలను "బాలచెలిమి"కి పంపే అవకాశం కలిగింది. మమ్మల్ని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ, మార్గనిర్దేశనం చేస్తూ ముందుకు నడిపిస్తున్న బాలచెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి మరియు మా ఉపాధ్యాయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

భవదీయులు,

**- బాలచెలిమి గ్రంథాలయం విద్యార్థులు**

## తెలివైన చీమలు

అనగనగా ఒక అడవిలో చీమలు ఒక పుట్టలో ఆనందంగా నివసించేవి. కానీ, ఒక రోజు ఒక పెద్ద పాము ఆ పుట్ట దగ్గరికి వచ్చి ఇలా అన్నది. "చీమలూ.. ఇప్పటి దాకా ఇది మీ పుట్ట. కానీ ఇక మీదట ఇది నా పుట్ట మాత్రమే. రేపటి కల్ల మీరు ఈ పుట్టను విడిచిపెడితే సరే.. లేదంటే మీ ప్రాణాలను తీస్తాను" అని అన్నది పాము. ఇది విన్న చీమలు చాలా భయపడ్డాయి. తరువాత రోజు ఉదయం చీమల రాజు ఏదో ఒకటి చేసి ఆ పాము మన



పుట్టను తీసుకోకుండా చేయాలి అని అనుకున్నాడు. కాసేపటి తర్వాత చీమ రాజు చీమలందరికి ఒక ఉపాయం చెప్పాడు.

సాయంత్రం అయ్యింది. చీమలు పాము కోసం ఎదురు చూస్తున్నాయి. కొన్ని నిమిషాల తర్వాత పాము రానే వచ్చింది. రాగానే, పాము చీమలతో ఇలా అన్నది. "మీరంతా నేను రాకముందే ఇక్కడి నుంచి వెళ్ళడానికి సిద్ధం అయ్యారా" అని అన్నది. కానీ, చీమలు అంతా కలిసి "మేము ఇక్కడ నుంచి వెళ్ళిపోము. ఇది మా పుట్ట. మేము ఇక్కడే ఉంటాం" అని అన్నాయి. అప్పుడు పాము చీమలను చంపడానికి ప్రయత్నించింది. అప్పుడే చీమల రాజు చీమలతో "దాడి చేయండి" అన్నాడు. అప్పుడు చీమలంతా కలిసి పాము మీదికి ఎక్కి పాము చర్మం కొరికాయి, కళ్ళు పొడిచాయి. దాంతో పాము అక్కడే చనిపోయింది. చీమలు మళ్ళీ వారి పుట్టలో ఆనందంగా జీవించారు.

***నీతి : చిన్నవని తక్కువగా చూడకూడదు. అందరు కలిస్తే, ఐకమత్యంగా ఉంటే దేన్నైనా సాధించగలరు.***

**- బి. లహరి**

7వ తరగతి, జెడిపిహెచ్ఎస్ గీతానగర్, సిరిసిల్లా

ఇ. రవి (టీచర్), m: 98487 70345

(బాలచెలిమి గ్రంథాలయం స్ఫూర్తితో విద్యార్థుల కథల వికాసం)

## తాబేలు తెలివి



బీబీపేట అడవి రాజు సింహం. తాబేలుకు మరియు కుందేలు, పరుగు పోటీ పెడతాడు. ఆ పోటీలో కుందేలు చాలా వేగంగా పరుగెడుతుంది. కుందేలుకు చాలా ఆయాసం వచ్చి చెట్టు క్రింద పడుకుంది. తాబేలు మాత్రం మెల్లగా మెల్లగా వెళ్లి గమ్యం చేరుతుంది తాబేలు గెలుస్తుంది.

ఆ పరుగు పోటీలో గెలిచిన తాబేలు, "నేను నీళ్ళలో ఉంటాను, కుందేలు భూమి మీద ఉంటుంది. అంటే ఎక్కడ నివసించే వాటికి అంటే తాబేలుకి, తాబేలు తోటి పోటి పెట్టడం, కుందేలుకి, కుందేలు తోటి పోటి పెట్టడం భావ్యం, ఈ విధంగా పోటి పెడితే బాగుంటుంది. ఇలా పోటీలు పెట్టడం తగదు. భూమ్మీద నడవడం వలన నా దేహానికి చిన్న గాయాలైనాయి. రాజు గారి మాట గౌరవించి పాల్గొన్నాను అని తాబేలు అంది.

అప్పుడు రాజు నిన్ను మేము ఎంతో చులకనగా చూసాం. నీకు చాలా తెలివి ఉంది. గొప్ప ఆలోచనలు ఉన్నాయి. ఇంత వరకు ఈ ఆలోచన నాకెందుకు రాలేదు అని సింహం ప్రశ్నించుకుంటుంది. తప్పుడు సలహాలిచ్చిన నక్కను మందలించాలనుకుంది. ఇంకోసారి ఏమైనా పోటీలు పెడితే ఏ జంతువు తోటి అదే జంతువుకు పోటీ పెట్టాలని రాజు గారు నిర్ణయించారు. ఆ మాటలు విని జంతువులన్ని సంతోషించాయి.

**– ఉప్పు రుచిత**
9వ తరగతి, జెడిపిహెచ్ఎస్ బీబీపేట
ఎల్. రామేశ్వర్ రెడ్డి (టీచర్), m: 99891 75105

## నీటి విలువ




భువనవనం అనే ఊరిలో ఒక పిల్లవాడు ఉండేవాడు. అతని పేరు శివ. శివ రోజు బడికి వెళ్ళేవాడు. బాగా చదువుకునే వాడు. కాని శివకి ఒక చెడు అలవాటు ఉండేది. ఏమిటంటే నీళ్ళు వృథా చేసేవాడు. ఒక రోజు శివ బడిలో చేతులు కడుక్కొని నీళ్ళ నల్లా బందు చేయలేదు. అప్పుడు వాళ్ళ మిత్రుడు రాజు వచ్చి "శివ, నీళ్లు ఎందుకు వృథా చేస్తున్నావు" అని అడిగాడు. అప్పుడు శివ "నా ఇష్టం. నీకేంటి" అని అక్కడి నుండి కోపంగా వెళ్ళిపోయాడు. రాజు నల్లా బందు చేసి వెళ్ళిపోయాడు. రాధిక టీచర్ అది గమనించింది. శివ నల్లా బందు చేయని విషయం రాధిక చాలా సార్లు గమనించింది. కొన్ని సార్లు చెప్పి చూసింది. శివలో మార్పు రాలేదు. టీచర్ శివకి బుద్ధి చెప్పాలనుకుంది. టీచర్ ఒక రోజు అందరిని విహార యాత్రకు అడవికి తీసుకెళ్లింది. అక్కడ శివ బాటిల్‌తో వారి మిత్రులమీద నీళ్ళు పోసి వృథా చేసాడు. శివ వారి మిత్రులతో కొద్దిసేపు ఆడుకున్నాడు. శివకి దాహం వేసింది. అప్పుడు బాటిల్ చూస్తే ఒక్క చుక్క నీళ్ళు లేవు. శివకు దాహం వేసి టీచర్ దగ్గరకు వెళ్ళి "టీచర్, నీళ్ళు ఇవ్వండి. దాహం వేస్తుంది" అని అడిగాడు. టీచర్ నీళ్ళు ఇవ్వలేదు. మిత్రులు కూడా ఎవరు ఇవ్వలేదు. శివ టీచర్‌ను బ్రతిమాలాడు. టీచర్ శివకు నీళ్లు ఇచ్చి "శివ, నువ్వు నీళ్ళు వృథా చేసావు, ఇప్పుడు తెలిసిందా నీరు మనకు ఎంత అవసరమో" అని అడిగింది. "నన్ను క్షమించండి టీచర్. నాకు నీటి విలువ తెలిసింది. ఇక నుండి నీటిని వృథా చేయను" అని శివ అన్నాడు. శివలోని మార్పును చూసి రాజు, టీచర్ రాధిక సంతోషించారు.

***నీతి : నీటిని వృథా చేయకండి, మానవ జీవాన్ని, మూగ జీవులను రక్షించండి.***

**– బొజ్జ అఖిల**
8వ తరగతి, జెడిపిహెచ్ఎస్, అనంత సాగర్, సిద్దిపేట జిల్లా
బైతి దుర్గయ్య (టీచర్), m: 9959007914

## పట్టుదల



అనగనగా ఒక చిన్న ఊరు రామగిరి. ఆ ఊరిలో చంద్రం, మమత అనే దంపతులు ఉండేవారు. వారికి మణిదీప్, ప్రకాష్ అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారికి చదువు అసలే ఒంటపట్టలేదు. కానీ వారిది మధ్యతరగతి కుటుంబం. కొడుకులు బాగా చదివి, పెద్ద ఉద్యోగం చేస్తూ గొప్పగా బతకాలని తల్లిదండ్రులకు ఆశ. కానీ బిడ్డలు ఇద్దరు చదువుకోవడానికి ఇష్టపడేవారు కాదు. తల్లిదండ్రుల బలవంతంతో ఇద్దరూ ప్రతిరోజు పాఠశాలకు వెళ్లేవారు. కానీ వారిద్దరికీ కరాటే అంటే చాలా ఇష్టం. వారికి కరాటే అంటే చాలా ఇష్టమని, తండ్రికి ఎన్నోసార్లు చెప్పినా, పట్టించుకోలేదు. ప్రతిరోజు వారు బడికి వెళ్లే దారిలో, కరాటే శిక్షణ జరుగుతుండేది. కరాటే మాస్టర్ కృష్ణ శిక్షణ ఇస్తుంటాడు. మణిదీప్, ప్రకాష్‌లు రోజు అరగంట పాటు కరాటే లో శిక్షణ తీసుకునేవారు. కరాటే మాస్టర్ కృష్ణ కూడా వారి ఇష్టాన్ని చూసి, ఉచితంగా శిక్షణ ఇచ్చేవాడు. వారు కూడా చక్కగా నేర్చుకొని సాధన చేయసాగారు. ఒకరోజు బంధువుల పెళ్లి సందర్భంగా తల్లిదండ్రులు ఊరికి వెళ్లారు. ఇంట్లో ఇద్దరే ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో దొంగలు పడ్డారు. అలికిడి విన్న మణిదీప్, ప్రకాష్ లు ఏమాత్రం భయపడకుండా ముగ్గురు దొంగలను కరాటే ద్వారా శిక్షించి, తాడుతో కట్టిపడేసారు. మరుసటి రోజు సర్పంచ్ దొంగలను పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకొని వచ్చిన చంద్రం, మమతలు బిడ్డలను దగ్గరకు తీసుకుని, ఇకనుంచి మీరు కరాటే నేర్చుకోవచ్చు అని చెప్పారు. మణిదీప్, ప్రకాష్ ఇద్దరు సంతోషించి, కరాటే నేర్చుకుంటూ బాగా చదువుకుని, ఉన్నత స్థాయిలో నిలిచారు. అలాగే వారికి సమయం చిక్కినప్పుడల్లా గ్రామంలో ఉన్న చిన్నారులకు కరాటే శిక్షణ ఇవ్వసాగారు. ఆత్మ రక్షణకు కరాటే అవసరమని గుర్తించి బాలికలు సైతం కరాటే నేర్చుకున్నారు.

***నీతి: పిల్లలకు చదువుతోపాటుగా వారి ఇష్టాలను కూడా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.***

– సంగేపు కీర్తన
9వ తరగతి, జెడిపిహెచ్ఎస్ హవేలి ఘనపురం, మెదక్ జిల్లా
ఉండ్రాళ్ళ రాజేశం (టీచర్), m: 99669 46084

## బాలవాక్కు



మాదారం గ్రామంలోని కొండ చెరువు, కొంగలతో, పక్షులతో, బాతులతో, నీళ్లలోని చేపలతో కళకళలాడేవి. సరియైన వర్షాలు కురియక నీళ్లు లేక అవన్నీ వలస పోయాయి. వర్షాలు పడిన కొన్ని రోజుల తర్వాత కొంగలు మాత్రం ఊరి చెరువుకు వచ్చాయి. బాగా ఆకలితో నున్న కొంగలు చెరువులో నీటి మీద కనపడుతున్న చేపల్ని చూసి గబగబా తినేసాయి. అవి బతికి ఉన్నాయా చనిపోయినవా అని చూడలేదు. వాటికి కడుపు నొప్పి వచ్చినట్లు గిరగిరా తిరిగి పడిపోయినవి కొన్ని. ఏదో వాసన, రంగురంగుల కవర్లు పురుగుల మందు కవర్లను చూసి చాలా కొంగలు చెరువు వైపు చూడకుండా వేరే వైపు వెళ్లిపోయినవి. పురుగుల మందు కవర్లు ప్లాస్టిక్ కవర్లు ఇతరత్రా భూమిలో పాతిపెట్టిన బాగుండు. చెరువు నీటిలో వేయడం వలన నీరంతా కలుషితమై విషతుల్యమైనవి. నీటిలోని చిన్న చేపలు కొన్ని చనిపోయినవి. నీళ్లు తాగడానికి ఎడ్లు, బర్లు, మేకలు ఏ జంతువు కూడా ఈ నీళ్లు తాగడానికి రాలేదు. కారణం నీళ్లన్ని పాయిజన్‌లా అయినవి. నాకేందని అందరు చెరువులో చెత్త వేయడం, పురుగు మందుల డబ్బాలు, కవర్లు ఇంకా అనేకంగా నీటిలో వేయడం, మూగప్రాణుల ప్రాణాలకు ముప్పు వచ్చింది. కొంత మందైతే బైక్‌ల మీద వెళుతూ చెరువులో విసిరేసారు కూడా. అయ్యల్లారా, అమ్మల్లారా, చెత్తా చెదారాన్ని చెత్త బుట్టల్లో వేయండి, చెరువలల్ల కాలువలల్ల డ్రైనేజి కాల్వలల్ల వేయకండి. మన ఆరోగ్యానికి నష్టం. తడి చెత్త, పొడిచెత్త హానికర చెత్త బుట్టల్ని వినియోగించండి. చెత్త బండి వచ్చినప్పుడు అందులో వేయండి అని ఉపాధ్యాయులతో కలిసి ప్లే కార్డులతో ఇంటింటికి ప్రచారం చేసారు. ఇది మా బాలవాక్కు బ్రహ్మ వాక్కు అని ఆచరించండి మా మాట. మేం చేసిన ఈ పనికి గ్రామమంతా తరలివచ్చి, పరిసరాల్ని కలుషితం చేయమని బడి దగ్గర పిల్లలు పెద్దలు ప్రతిజ్ఞ చేసారు.

– మహ్మద్ అఫ్రోజ్
7వ తరగతి, జెడ్‌పిహెచ్ఎస్, పోత్గల్,
రాధాకిషన్ రావు (హెచ్.ఎం.), m: 94413 69186

## బాలల మాట-బంగారు బాట పుస్తకావిష్కరణ



23.2.2026న ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల కరపత్రాల ఆధారంగా సయ్యద్ షఫీ సంపాదకత్వంలో వెలువడిన "బాలల మాట-బంగారు బాట" పుస్తకం ఆవిష్కరించబడింది.

## జాతీయస్థాయిలో మెరిసిన సిద్దిపేట యువ రచయితలు




సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి కథారచన పోటీలో 13 కథలతో ప్రతిభ చూపారు. కట్టోజు నీరజ మొదటి బహుమతి సాధించారు. ప్రిన్సిపల్ జి. సునీత, తెలుగుశాఖ అధ్యక్షుడు మట్టా సంపత్కుమార్ రెడ్డి అభినందించారు. బాలచెలిమి, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీ నిర్వహించబడింది. యువతరం కథలకు నూతన అధ్యాయం అని పేర్కొన్నారు. కథాసంకలనం ISBNతో ప్రచురితమైంది. బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, కన్వీనర్ గరిపల్లి అశోక్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## పఠనం ద్వారా ఉన్నత భవిష్యత్తు




బాల్య దశలోనే బాలసాహిత్య పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మధురాక్షి అన్నారు. హవేలి ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలసాహిత్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు పరిచయం చేశారు.

## 'ఉప్పు మూట దూది మూట' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం మానవ వికాసానికి దోహదం చేస్తుందని నడింపల్లి సత్యనారాయణ రాజు అన్నారు. తిరుపతిలో ఆసూరి ఉషారాణి రచించిన ఉప్పు మూట దూది మూట బాలల బొమ్మల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకంలో నైతిక విలువలను ప్రతిబింబించే 44 కథలు ఉన్నాయని రచయితలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సాహిత్య ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## పురిమళ్ల ఫౌండేషన్ జాతీయస్థాయి కథలు, కవితల పోటీ ప్రకటన

పురిమళ్ల ఫౌండేషన్ ఖమ్మం 8వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు జాతీయస్థాయి కథలు, కవితల పోటీ నిర్వహిస్తున్నారు. సామాజిక అంశంపై రచనలకు ఆహ్వానం. పోస్టు ద్వారా మాత్రమే పంపాలి. చివరి తేదీ 15 మే 2026. వివరాలు: భోగోజు ఉపేందర్ రావు, ఫోన్: 9494773969.

## మాధురి 'శతక స్ఫూర్తి' పుస్తకావిష్కరణ



మహబూబ్ నగర్ జిల్లా వేముల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని డి. మాధురి 'శతక స్ఫూర్తి' పుస్తకావిష్కరణలో నాయిని బాగన్న గౌడ్, రామమోహనరావు, చెన్నమ్మ, కళాకారులు, ఉపాధ్యాయులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు కథల పోటీ ఫలితాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన పిల్లల కథల పోటీలో మొత్తం 180 కథలు అందగా, 10 కథలు బహుమతికి ఎంపికయ్యాయి. మొత్తం 70 కథలతో సంకలనాన్ని వచ్చే నెల 4న హైదరాబాద్‌లో ఆవిష్కరించనున్నారు. విజేతలు: కే కౌండిన్య తిలక్ (హైదరాబాద్), డా. పోతగాని సత్యనారాయణ (ఖమ్మం), మొర్రి గోపి (శ్రీకాకుళం), బి.వి. పట్నాయక్ (పార్వతీపురం), తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర (ఖమ్మం), కోనే నాగ వెంకట ఆంజనేయులు (విశాఖపట్నం), కె.వీ. లక్ష్మణరావు (కోనసీమ), జొన్నలగడ్డ శ్యామల (హైదరాబాద్), అనిశెట్టి సతీష్ కుమార్ (సిద్దిపేట), జీవి శ్రీనివాస్ (విజయనగరం).

## యువ క్రికెటర్లకు మార్గదర్శకుడు

# ఎం.ఎల్.జయసింహ

ఎం.ఎల్.జయసింహ భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన ప్రముఖ బ్యాట్స్‌మన్. ఆయన 1939 మార్చి 3న సికింద్రాబాద్‌లో జన్మించారు. "మోటగానహళ్ళి" అనే ఇంటిపేరు కర్ణాటక రాష్ట్రంలోని మాగడి ప్రాంతానికి చెందిన గ్రామాన్ని సూచిస్తుంది. అందువల్ల వారి కుటుంబం ఒకప్పుడు కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడిందని భావించవచ్చు. చిన్నప్పటి నుంచే ఆయనకు క్రీడలపై, ముఖ్యంగా క్రికెట్‌పై ఆసక్తి ఉండేది. బాల్యంలోనే ఆయన సహజ ప్రతిభను ప్రదర్శించి పాఠశాల స్థాయిలో అనేక మ్యాచ్‌లలో పాల్గొని తన నైపుణ్యాన్ని నిరూపించారు. జైసింహ కుడిచేతి వాటం కల స్టైలిష్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు.



జైసింహ తన విద్యాభ్యాసాన్ని హైదరాబాద్‌లోనే పూర్తి చేశారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. కాలేజీ జీవితంలో ఆయన క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసి స్థానిక జట్లలో స్థానం సంపాదించారు. ఆయన బ్యాటింగ్ శైలి క్లాసికల్ టెక్నిక్‌తో పాటు సహనాన్ని కలిగి ఉండేది. బంతిని జాగ్రత్తగా ఎంపిక చేసుకుని ఆడటం, అవసరమైనప్పుడు వేగంగా పరుగులు సాధించడం ఆయన ప్రత్యేకత. ఈ లక్షణాల వల్ల కోచ్‌లు, సెలెక్టర్లు ఆయన ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయి క్రికెట్‌కు ప్రోత్సహించారు.

1959లో జైసింహ భారత జాతీయ క్రికెట్ జట్టులోకి ఎంపికయ్యారు. అదే సంవత్సరం ఆయన టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయన స్టైలిష్ బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకుంది. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఆడగలగడం ఆయన ప్రత్యేక లక్షణం. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బాధ్యతగా ఆడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంలో ఆయన నైపుణ్యం చూపించారు.

జైసింహ కెరీర్‌లో అత్యంత ప్రసిద్ధ ఘట్టాల్లో ఒకటి ఆయన సాధించిన అరుదైన ఘనత. ఒక టెస్ట్ మ్యాచ్‌లో ఐదు రోజుల పాటు ప్రతి రోజూ బ్యాటింగ్ చేసిన ఆటగాడిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఇది ఆయన సహనం, ఫిట్‌నెస్ మరియు ఆటపై ఉన్న అంకిత భావాన్ని స్పష్టంగా చూపిస్తుంది. దీర్ఘ ఇన్నింగ్స్ ఆడడంలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉండేది. జట్టును కష్టకాలం నుండి బయటకు తీసుకువచ్చే కీలక ఆటగాడిగా ఆయన సేవలు అందించారు.

బ్యాటింగ్ మాత్రమే కాకుండా ఫీల్డింగ్‌లో కూడా ఆయన మంచి ప్రతిభ చూపారు. జట్టు అవసరాన్ని బట్టి వివిధ స్థానాల్లో ఆడి తన అనువర్తనాన్ని నిరూపించారు. ఆయన ఆటలో ఉన్న సొగసు, సాంకేతిక నైపుణ్యం అభిమానులను ఆకట్టుకుంది. అందువల్ల ఆయనను "క్లాసిక్ బ్యాట్స్‌మన్"గా పిలిచేవారు.

సెలక్షన్ కమిటీ సభ్యుడిగా పనిచేసి యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు.

1999 డిసెంబర్ 30న జైసింహ కన్ను మూశారు. ఆయన మరణం భారత క్రికెట్ ప్రపంచానికి పెద్ద లోటు. ఆయన సాధించిన విజయాలు, సేవలు చిరస్థాయిగా నిలిచాయి. కష్టపడి పనిచేస్తే విజయాలు సాధ్యమని ఆయన జీవితం ప్రతి యువ క్రీడాకారుడికి ప్రేరణగా నిలుస్తుంది.

– సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS





Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI**, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026




# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com